డ్రైవింగ్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ డ్రైవింగ్ స్కూల్‌లో హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్ శిక్షణ కోసం ఎస్సీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల సేవా సహకార సంస్థ చైర్మన్, కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఐదుగురు పురుషులు, ఐదుగురు మహిళలకు శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణ ఖర్చును ఎస్సీ కార్పొరేషన్ భరిస్తుందన్నారు. దరఖాస్తులను ఈ నెల 27వ తేదీ లోపల సమర్పించాలన్నారు. మరిన్ని వివరాలకు 90300 14742, 96424 60838, 96526 00967 నెంబర్లకు సంప్రదించాలని కలెక్టర్ సూచించారు.

- రూ.7.93కోట్లతో పైలెట్ ప్రాజెక్టుకు ఆమోదం
- వెయ్యి ఎకరాల్లో అదనంగా సాగు
- 90 శాతం సబ్సిడీపై విత్తనాల సరఫరా
- గిరిజన రైతులకు లబ్ధి
- త్వరలో టెండర్ల నిర్వహణ

పసుపు పంటకు ప్రోత్సాహం



సీతంపేట రూరల్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): మన్యంలో గిరిజన రైతుల పసుపు సాగును ప్రోత్సహిస్తూ.. వారికి ఆర్థిక చేయూతనిచ్చే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందుకోసం రూ.7.93కోట్లతో పైలెట్ ప్రాజెక్టుకు ఆమోదం తెలిపింది. ఈ నిధులతో సబ్‌ప్లాన్ మండ లాల్లోని 1000 ఎకరాల్లో అదనంగా పసుపు సాగు చేపట్టనున్నారు. ఈ పైలెట్ ప్రాజెక్ట్ అమలుతో సుమారు 2వేల మంది గిరిజన రైతులు లబ్ధిపొందనున్నారు. 90శాతం సబ్సిడీతో అందించను న్న పసుపు విత్తనాల సరఫరా కోసం ఇప్పటికే ఐటీడీఏ వేదికగా ఈ-టెండరింగ్ ద్వారా బిడ్‌లు ఆహ్వానించారు. అయితే బిడ్‌లు దాఖలు చేసేందుకు ఎవరూ ముందుకు రాలేదు. వచ్చే ఏడాది జనవరిలో మరోసారి టెండర్ల ప్రక్రియ నిర్వహించేందుకు ఐటీడీఏ అధికారులు సన్నద్ధమవుతున్నారు.



మోహనకాలనీ గిరిజన గ్రామంలో రైతులు ఎండబెట్టిన కస్తూరి రకం పసుపు కొమ్ములు

పంట అభివృద్ధికి చర్యలు

ఐటీడీఏ పరిధిలో 20 సబ్‌ప్లాన్ మండలాలు ఉన్నాయి. అయితే 12మండ లాల్లో నివసిస్తు న్న గిరిజన రైతు లు అత్యధికంగా పసుపును పండి స్తున్నారు. 3,786 మంది 6,887 ఎకరాల్లో సాగు చేపడుతు న్నారు. కాగా గతంలో ఐటీడీఏ ద్వారా ఇచ్చిన కస్తూరీ రకం పంటను మాత్రమే వారు పండిస్తుండడంతో ఆశించిన స్థాయిలో దిగుబడులు రావడం లేదు. ఎకరాకు 1480 కేజీలు మాత్రమే దిగుబడి వస్తోంది. అయితే పైలెట్ ప్రాజెక్ట్ కింద అందించనున్న సేలం, ప్రగతి రకాల విత్తనాలతో ఎకరాకు 3టన్నుల దిగుబడి వచ్చే అవకాశం ఉంది. దీంతో ఈ రకాలకు చెందిన పసుపు విత్తనాలనే గిరిజన రైతులకు పంపిణీ చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

● అధిక డిమాండ్

కొండపోడు వ్యవసాయంలో భాగంగా గిరిజనులు పండించే సాధారణ పంటలతో పాటు ఈ ప్రాంత పసుపునకు మైదాన ప్రాంతంలో గిరాకీ ఎక్కువ. పచ్చి, ఎండు పసుపునకు మంచి ధర లభిస్తుండడంతో వాటి సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. దీనికితోడు (మిగతా 8వ పేజీలో..)

సబ్సిడీతో అందిస్తాం

'గిరిజన ప్రాంతాల్లో పసుపు సాగు చేస్తున్న గిరిజన రైతులకు ప్రభుత్వ ఆదేశాల మేరకు సబ్సిడీతో కూడిన కొత్తరకం పసుపు విత్తనాలు, తదితర యంత్రాలను అందిస్తాం. అయితే ఈ ఏడాది పసుపు పైలెట్ ప్రాజెక్ట్ కోసం ఆన్‌లైన్ టెండర్‌లు నిర్వహించినప్పటికీ టెండర్‌దారులు ఎవరూ ముందుకు రాలేదు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి వచ్చే ఏడాది టెండర్లు నిర్వహిస్తాం.' అని ప్రాజెక్ట్ హార్టికల్చర్ అధికారి ఆర్‌వీ గణేష్ తెలిపారు.



సీతంపేట మన్యంలోని కొండ ప్రాంతంలో రైతులు పండిస్తున్న పసుపు పంట



పల్లె వాకిట వికసించిన

జానపదం

- కళాకారులకు ఉమ్మడి జిల్లా చిరునామా
- గరివిడి లక్ష్మి సినిమాతో తాజాగా మరింత గుర్తింపు
- రేలారే రేలాతో వాడవాడలా పేరు
- హరికథకు పుట్టినిల్లుగా ఖ్యాతి

6లో

సంక్షేమ పథకాలు

వర్తింపజేయాలి

- సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ కార్యకర్తల నిరసన

8లో

రోడ్లు లేవు.. కాలువలు

నిర్మించలేదు

- బురదమయంగా వీధులు
- ఇదీ దుగ్గేరులో పరిస్థితి

రూ.100 కోట్లతో

పొగాకు కొనుగోలు

7లో



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో భాస్కరరావు

ప్రాథమిక దశలో క్యాన్సర్‌ను గుర్తిస్తే మేలు

● జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి భాస్కరరావు

పార్వతీపురం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తిస్తే ప్రాణాపాయం తప్పుతుందని జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి ఎస్.భాస్కరరావు అన్నారు. ఎన్‌సీడీ 4.0లో భాగంగా క్యాన్సర్ స్క్రీనింగ్‌పై వైద్యాధికారులు, వైద్య సిబ్బందికి గురువారం ఎన్‌జీవో హోంలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో భాస్కరరావు మాట్లాడుతూ.. క్యాన్సర్‌లో ముఖ్యంగా నోటి, రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ కేసులు ఎక్కువగా నమోదు అవుతున్నాయన్నారు. క్షేత్రస్థాయిలో తాము నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించేందుకు వైద్యాధికారులు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ జగన్మోహన్‌రావు, కో-ఆర్డినేటర్ డాక్టర్ సునీల్, డీపీఎంవో రఘుకుమార్, వైద్యులు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

● జిల్లా పంచాయతీ అధికారి కొండలరావు

గరుగుబిల్లి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల పరిధిలో పరిసరాలు పరిశుభ్రతపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా పంచాయతీ అధికారి కొండలరావు హెచ్చరించారు. గురువారం గొట్టివలస, మరుపెంట, ఉల్లిభద్ర పంచాయతీల్లో పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంచాయతీల పరిధిలో తడి, పొడి చెత్తలను వేరు చేసి చెత్త సంపద కేంద్రాలకు తరలించాలన్నారు. కేంద్రాల పరిధిలో వేరు చేసి సేంద్రియ ఎరువులు తయారీకి దృష్టి సారించాలన్నారు. గ్రామాల్లో ప్లాస్టిక్ వినియోగానికి దూరంగా ఉండాలని, దుకాణాల్లో విక్రయిస్తే అపరాధ రుసుం తప్పదని హెచ్చరించారు. ప్లాస్టిక్ వినియోగంతో కలిగే అనర్థాలను ప్రజలకు వివరించి, నిషేధంపై వారికి అవగాహన కల్పించాలని కార్య దర్శులు, సచివాలయ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో ఎల్.గోపాలరావు, కార్యదర్శులు పి.శిరీష, ఎం.భార్గవనాయుడు, ఎస్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



గొట్టివలసలో అవగాహన కల్పిస్తున్న డీపీవో కొండలరావు

నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం

● వయోజన విద్యాధికారి వైకుంఠరావు



శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

బెలగాం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే 'ఉల్లాస్ - అక్షర ఆంధ్ర' లక్ష్యమని వయోజన విద్యా అధికారి టంకాల వైకుంఠరావు అన్నారు. వయోజనులకు చదవడం, రాయడం, చిన్నచిన్న లెక్కలు చేయగలిగేలా నేర్పించడంపై వివిధ శాఖల అధికారులకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం కలెక్టర్ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో 2,01,058 మంది నిరక్షరాస్యులు ఉన్నట్లు సచివాలయ సిబ్బంది సర్వే ద్వారా తెలిసిందన్నారు. 2029 నాటికి వారిని అక్షర ఆంధ్ర కార్యక్రమం ద్వారా అక్షరాస్యులుగా తీర్చిదిద్దుతామని అన్నారు. డీఆర్‌డీఏ, మెప్మా, డ్వామా శాఖల ద్వారా వలంటీర్ టీచర్లను గుర్తించి 1:10 చొప్పున నిరక్షరాస్యులను మ్యాపింగ్ చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ సుధారాణి, ఐసీడీఎస్ పీడీ కనకదుర్గ తదితర అధికారులు పాల్గొన్నారు.

వంద ఎకరాల ఆయకట్టు ఉన్న వీరఘట్టం చెరువు



చెరువులకు మహర్దశ

- వంద ఎకరాల ఆయకట్టు దాటినవి ఆధునికీకరణ
- దృష్టి సారించిన ప్రభుత్వం
- జిల్లాలో 90 చెరువుల గుర్తింపు
- వచ్చే ఖరీఫ్ నాటికి పనులు పూర్తిచేసేందుకు ప్రణాళికలు

పార్వతీపురం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వంద ఎకరాల ఆయకట్టు దాటిన చెరువులకు మహర్దశ పట్టనుంది. ఈ చెరువులను ప్రభుత్వం అభివృద్ధి చేయనుంది. పార్వతీపురం, పాలకొండ డివిజన్‌ల పరిధిలోని 10 మండలాల్లో 90చెరువులు వంద ఎకరాలకు పైబడి ఆయకట్టు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. పార్వతీపురం మండలంలో 22, సాలూరు 9, మక్కువ 2, గరుగుబిల్లి 13, కొమరాడ 6, కురుపాం 6, జియ్యమ్మవలస 1, గుమ్మలక్ష్మీపురం 2, సీతానగరం 17, బలిజపేట మండలంలో 12 మొత్తం 90 చెరువులను గుర్తించారు. వీటి పరిధిలో 19,868 ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ చెరువులను మొదటి దశలో అభివృద్ధి చేయనున్నారు. వాస్తవానికి తొలుత జిల్లాలో14 చెరువుల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఇరిగేషన్ శాఖ అంచనాలు తయారు చేసింది. ఇందులో పార్వతీపురం మండలంలో 4, సాలూరు 2, కురుపాం 4, గరుగుబిల్లి, కొమరాడ, జియ్యమ్మవలస, గుమ్మలక్ష్మీపురం మండలాల్లో ఒక్కొక్క చెరువును అభివృద్ధి చేయాలని అధికారుల నిర్ణయించారు. అయితే, జిల్లా వ్యాప్తంగా వంద ఎకరాలు దాటిన ఆయకట్టుకు సంబంధించిన చెరువులను గుర్తించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. దీంతో మిగిలిన చెరువులకు కూడా అంచనాలు తయారు చేసి వాటిని అభివృద్ధి చేసేందుకు ఇరిగేషన్‌శాఖ చర్యలు తీసుకుంటుంది. చెరువు గట్లను పటిష్టం చేయడం, చప్టాల నిర్మాణం, మదుమల మరమ్మతులు తదితర పనులు చేపట్టనున్నారు.

ప్రత్యేక దృష్టిసారించిన ప్రభుత్వం

కూటమి ప్రభుత్వం ఇరిగేషన్ శాఖపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించింది. గతంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు నీరు-చెట్టు కార్యక్రమం కింద చెరువులను అభివృద్ధి చేశారు. తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం సాగునీటి చెరువులను పట్టించుకోలేదు. దీంతో చాలా గ్రామాల్లో చెరువులు పూడికలు, పిచ్చిమొక్కలతో నిండిపోయాయి. ఫలితంగా (మిగతా 8వ పేజీలో..)

● చెరువుల అభివృద్ధి, గ్రౌండ్ వాటర్ తదితర అంశాలపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, జేసీ శోభిక తదితర అధికారులు హాజరయ్యారు. జిల్లాలోని పరిస్థితిని కలెక్టర్ వివరించారు. ఈ నెల 25 నాటికి ప్రభుత్వ శాఖల్లో డాక్యుమెంట్లు అప్‌లోడ్ పూర్తి చేస్తామని చెప్పారు.

కొత్త బాటలో ఆర్టీసీ



- సేవల విస్తరణే లక్ష్యం
- రవాణాతో పాటు కొరియర్‌కు ప్రాధాన్యం
- టెంపుల్ టూరిజం, శుభకార్యాలకు తక్కువ ధరకే సర్వీసులు
- కార్గో సేవలు సైతం విస్తృతం
- ఆదాయం పెంచుకునేందుకు ప్రయత్నం

రాజాం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీ ఆదాయం పెంచుకునే మార్గాలపై దృష్టిపెట్టింది. రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 15 నుంచి ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ పథకం అమలుచేస్తున్న సంగతి తెలిసిందే. ఈ పథకం నిర్వహణతో భారం పడకుండా కొత్త ఆదాయ మార్గాలను అన్వేషిస్తోంది. అందులో భాగంగా కార్గో సేవలను పెంచుకోనుంది. మరోవైపు టెంపుల్ టూరిజం, శుభకార్యాలకు తక్కువ ధరకే ఆర్టీసీ సేవలను అందుబాటులో తెస్తోంది. దీనిపై ప్రజలకు అవగాహన పెంచాలని భావిస్తోంది.



ఉమ్మడి జిల్లాల పరిధిలో ఐదు డిపోలు ఉన్నాయి. విజయనగరం, శృంగవరపుకోట, సాలూరు, పార్వతీపురం, పాలకొండలోని డిపోల పరిధిలో దాదాపు 450 బస్సులున్నాయి. ఇవి రోజుకు సగటున 1.5 లక్షల కిలోమీటర్లు ప్రయాణిస్తున్నాయి. రోజుకు 95 లక్షల మందిని గమ్యస్థానాలకు చేర్చుతున్నాయి. విశాఖ, కాకినాడ, రాజమండ్రి, ఏలూరు, భద్రాచలం, విజయవాడ, గుంటూరు, తిరుపతి, హైదరాబాద్‌కు సైతం సర్వీసులు నడుస్తున్నాయి. ఈ నేపథ్యంలో కార్గో సేవలను కొన్నేళ్ల కిందట ప్రారంభించింది. దానిని మరింత విస్తృతం చేసే దిశగా అడుగులు వేస్తోంది. 24 గంటలూ బస్సుల రాకపోకలు ఉండడంతో చాలా సులువుగా, వేగంగా కొరియర్ సర్వీసులు ఆర్టీసీ ద్వారా అందుతు న్నాయి. ఆపై ప్రభుత్వరంగ సంస్థ కావడంతో ప్రజల్లో భద్రత, నమ్మకం ఉంటోంది. పైగా రాష్ట్రంలో 80 నగరాలు, పట్టణాల్లో ఆర్టీసీ డోర్ డెలివరీని విస్తరించింది. పట్టణాల్లో అయితే 10 కిలోమీటర్ల పరిధి వరకూ ఇళ్లకు పార్సిల్ అందిస్తోంది. దీంతో ప్రజలు సైతం ఏపీఎస్ ఆర్టీసీ కార్గో సేవలను ఎక్కువగా ఆశ్రయించ డం ప్రారంభించారు.

● ప్రస్తుతం ఆర్టీసీ కార్గో సర్వీసుల్లో 50 కిలోల వరకూ పార్సిల్స్ పంపించే అవకాశం కల్పించారు. కిలో బరు వుకు రూ.18, ఆరు కిలోలకు రూ.30, పది కిలోలకు రూ.36, 25 కిలోలకు రూ.48, 50 కిలోలకు రూ.59 చెల్లిస్తే సరిపోతుంది. ప్రస్తుతానికి 50 కిలోల వరకూ మాత్రమే అవకాశం ఇచ్చింది. అయితే ప్రజల నుంచి అంతకంటే మించిన బరువుకు అవకాశం ఇవ్వాలన్న డిమాండ్ వినిపిస్తోంది. మరోవైపు పారిశ్రామిక అవసరాలకు సైతం ఏపీఎస్‌ఆర్టీసీ కార్గో సేవలు అందుబాటులోకి వచ్చాయి. జీడిపప్పు, బియ్యం, ధాన్యం వంటి వ్యవసాయ ఉత్పత్తులకు సంబంధించి వ్యాపారవర్గాలు బుక్ చేసుకుంటే (మిగతా 8వ పేజీలో..)

పల్లె వాకిట వికసించిన జానపదం

జనం నోటి నుంచి వచ్చిందే జానపదం. కష్టనష్టాల్లో, సుఖ దుఃఖాల్లో పాడుకునేవే జానపదాలు. పండగ వచ్చినా.. పబ్బం వచ్చినా ఒకప్పుడు వాటినే పాడుకునేవారు.. వినేవారు.. శుభ కార్యాలు జరిగేటప్పుడు ప్రదర్శనలు ఏర్పాటు చేసేవారు. ఇప్పుడు కూడా జానపదాలకు ఆదరణ తగ్గలేదు. అయితే కొత్త రూపాన్ని సంతరించుకున్నాయి. తప్పెటగుళ్లు, బుర్రకథలు, హరికథలతో పాటు అధునాతనంగా రేలారే రేలా ప్రదర్శనలు బాగా ప్రాచుర్యంలోకి వచ్చాయి. ఇలా అనేక భిన్న కళా రూపాలకు పేరొందిన విజయనగరం జిల్లాలో జానపదాలపై జానపద కళాకారుల దినోత్సవం పురస్కరించుకుని ప్రత్యేక కథనం..

- కళాకారులకు జిల్లా చిరునామా
- గరివిడి లక్ష్మీ సినిమాతో తాజాగా మరింత గుర్తింపు
- రేలారే రేలాతో వాడవాడలా జిల్లా పేరు
- హరికథకు పుట్టినిల్లుగా ఖ్యాతి

నేడు జానపద కళాకారుల దినోత్సవం


పల్సర్ బైక్ రమణ

పల్సర్ బైక్ పాటతో..

పల్సర్ బైక్ రమణది మెరకముడిదాం మండలంలోని కొర్లాం. ఎనిమిదో తరగతి చదువుతుండగా రమణ తండ్రి అనారోగ్యానికి గురయ్యాడు. కుటుంబ ఆర్థిక కారణాల రీత్యా రమణ చదువుకు దూరమై ఓ కంపెనీలో చేరి నెలకు రూ. 1800 జీతం తీసుకునేవాడు. ఏడేళ్ల పాటు అదే కంపెనీలో పనిచేసిన రమణకు జానపదాలంటే చాలా ఇష్టం. ఈ క్రమంలోనే జానపదాల్లో రాణిస్తున్న కోరాడ జానకిరావు వద్దకు వెళ్లాడు. ఆయన శిష్యరికంలో స్టేజీ ప్రోగ్రాంలో రమణకు అవకాశం దక్కింది. పల్సర్ బైక్ పాటతో దశ తిరిగింది.

మూడు తరాలుగా పందిరిపాట..


బొబ్బిలి మండలం చింతాడ గ్రామానికి చెందిన జానపద కళాకారుల పందిరిపాట

బొబ్బిలి/బాడంగి, ఆగస్టు 21 (ఆంధ్ర జ్యోతి) మూడుతరాలుగా పందిరిపాట పేరుతో జానపదాన్ని కొనసాగిస్తున్నారు బొబ్బిలి మండలం చింతాడ గ్రామానికి చెందిన చింతాడ సన్యాసి. తమ తాత తండ్రుల నుంచి వస్తున్న జానపద కళను ఇప్పుడు తన కుమార్తె నాగమణి ప్రధాన పాత్రధారిగా నిరాటంకంగా కొనసాగిస్తున్నారు. గంగా వివాహం (శివపార్వతుల కళ్యాణం), ధర్మాంగధర చరిత్ర (పాముల పాట) జానపదాలను వీరు ప్రదర్శిస్తున్నారు. నాగమణికి శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్లకు చెందిన తామాడ రమణతో వివాహమైంది. ఆమెకు ఇద్దరు సంతానం. ఆమె తన తండ్రిద్వారా పందిరిపాటను నేర్చుకొని ఉత్తరాంధ్రజిల్లాల్లోని అనేక గ్రామాలలో 15 సంవత్సరాల నుంచి ప్రదర్శనలు ఇస్తున్నారు.

తప్పెటగుళ్లతో రాణించిన సత్యం..


జీకేఆర్‌పురం తప్పెటగుళ్ల కళాకారుల ప్రదర్శన

బాడంగి మండలం జీకేఆర్‌పురం గ్రామానికి చెందిన నీలబోను సత్యం తప్పెటగుళ్ల ప్రదర్శనలో దేశవ్యాప్తంగా విశేష ప్రాచుర్యం పొందారు. ఆయన బృందం బరిలోకి దిగితే పూనకం వచ్చిన మాదిరిగా ఒళ్లు గగుర్పొడిచే విధంగా తప్పెటగుళ్లు వాయిస్తూ లయబద్ధంగా జానపద నృత్యం చేస్తూ రక్తికట్టించడంలో దిట్టగా నిరూపించుకున్నారు.

‘రేలారే రేలా‘లో అద్భుత ప్రతిభ..

- దుమ్మురేపుతున్న మెంటాడ వాసి


పాండ్రంకి సత్యనారాయణ రేలారే రేలా ప్రదర్శన

మెంటాడ ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మెంటాడకు చెందిన పాండ్రంకి సత్యనారాయణ జానపద కళారూపమైన ‘రేలారే రేలా‘లో దమ్ముచూపుతూ దుమ్మురేపుతున్నాడు. ఇప్పటి వరకు సుమారు రెండువేల ప్రదర్శనలు ఇచ్చి ఔరా అనిపిస్తున్నాడు. చిన్ననాటినుంచే పాటలపై ఆసక్తి పెంచుకున్న పాండ్రంకి... తనతోపాటు తనలోని అనురక్తిని పెంచుకొని తన ప్రతిభతో అబ్బురపరుస్తున్నాడు. సామాజిక రుగ్మతలు, మూఢనమ్మకాలు, సాంఘిక దురాచారాలపై జనవిజ్ఞాన వేదికద్వారా ఎన్నో అభ్యుదయ, చైతన్య గీతాలను ఆలపించడంతో ప్రారంభమైన ఆయన ప్రయాణం - మెల్లమెల్లగా రేలారే రేలా వైపు సాగింది. 2000 సంవత్సరం వరకూ స్టేజ్ ప్రోగ్రామ్స్‌తో మెప్పించిన పాండ్రంకి... తర్వాత తర్వాత పూర్వీకుల నుంచి సేకరించిన బాణీలకు కొత్త సొబగులు అద్ది అందరి చేత భలా అనిపించుకుంటున్నాడు.

లింగిడి లింగిడి పాటతో సత్తా చాటిన రఘు..


జానపద పాటలు పాడుతున్న రఘు

గజపతినగరం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): నిన్నమొన్నటి వరకు ఏ ఒక్కరి నోట విన్నా సెల్ ఫోన్‌లో రింగ్ టోన్‌లు విన్నా లింగ్.. లింగ్ లింగిడి.. లింగిడి కింద జంగడి అనేపాట విస్తృతంగా వినపడేది. మూరుమాల గిరిజన కుటుంబంలో పుట్టి ఒక్క పాటతో రెండు తెలుగు రాష్ట్రాల్లో పాపులర్ అయిన జానపద కళాకారుడు పాలవలస రఘు పాడిన పాటే అది. గజపతినగరం మండలం పాతబగ్గాం గ్రామానికిచెందిన రఘు అంతరించిపోతున్న ఉత్తరాంధ్ర జానపద కళలను బతికించాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. మెంటాడ మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న సమయంలో అదే గ్రామానికి చెందిన డొంకాడ రామ్మోహనరావు వద్ద అన్నయ్య ఈశ్వరరావుతో కలిసి శిష్యరికానికి చేరి జానపద ప్రదర్శనలు ఇవ్వడం ప్రారంభించాడు. మొదట్లో బుర్రకథలో జానపద పాటలతో ప్రేక్షకుల మన్ననలు పొందుతూ జానపదంపై మరింత పట్టు సాధించారు. 2015లో రఘు రేలారే రేలా బృందాన్ని ఏర్పరిచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రదర్శనలు ఇస్తున్నారు. హీరో శ్రీకాంత్ నటించిన కోటబొమ్మాలి పీయస్ చిత్రంలో లింగిడి, లింగిడి అనే పాటను తాను రచించి, తానే పాడి కోట్లాది మంది హృదయాలను గెలుచుకున్నారు.

జానపద కళలను నేటి తరానికి చాటాలని..


బద్రి కూర్మారావు

విజయనగరం రింగురోడ్డు, ఆగస్టు 20 (ఆంధ్ర జ్యోతి): అంతరించిపోతున్న జానపద కళలను నేటి తరానికి తెలియజెప్పాలన్న ఉద్దేశంతో బద్రి కూర్మారావు మాస్టారు 2010 నుంచి గిడుగు రామమూర్తి తెలుగుభాషా జానపద కళాపీఠం స్థాపించి వివిధ రూపాల్లో సేవలు అందిస్తున్నారు. విజయనగరంలోని కొత్తవీధిలో జానపద విద్యాలయం, బాలల గ్రంథాలయాన్ని ఏర్పాటుచేశారు. విద్యార్థులకు జానపద సాహిత్యం, అంతరించిపోతున జానపద కళారూపాలను ప్రదర్శనలతో అవగాహన కల్పిస్తున్నారు. వేల సంవత్సరాల చరిత్ర కలిగిన 13వ శతాబ్దంలో కాకతీయుల కాలంలో వాడిన జముకు, తప్పెటగుళ్ల, తుడుము, గిరిజన వాయిద్యం, బుర్ర గిడుగు, పిల్లనగ్రోవీ, తంబూర, బొంగరాలు, తోలుబొమ్మలు, దీపపు బుడ్లు వంటి కళారూపాల గురించి అవగాహన పరుస్తున్నారు. శ్రీకాకుళం జిల్లా పలాస మండలం రంగోయిలో జన్మించిన ఈయన సబ్బవరంలో గురుకుల జూనియర్ కళాశాలలో ఆర్థికశాస్త్ర అధ్యాపకుడిగా పనిచేశారు. 2023 పదవీ విరమణ చేశాక విజయనగరంలో స్థిరపడ్డారు. ఉత్తరాంధ్ర జానపద కళలు' అనే గ్రంథాన్ని కూడా రచించారు.


తూర్పు భాగవతాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు


సత్యభామ వేషధారణలో బొంతలకోటి శంకరరావు

బొంతలకోటి.. జానపదంలో మేటి

- 13 తరాలుగా తూర్పుభాగవతం ప్రదర్శిస్తున్న కుటుంబం
- ఈ వీధినాటకంలో మగవారే స్త్రీ పాత్రధారులు

బొబ్బిలి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): తూర్పుభాగవతం (భామా కలాపం) ఇదో సంప్రదాయ ఉత్తరాంధ్ర జానపద కళ. అందరినీ విశేషంగా కట్టిపడేసే ఓ వీధి నాటకం. బొబ్బిలి మండలం కోమటిపల్లి గ్రామానికి చెందిన బొంతలకోటి కుటుంబానికి ఈ కళ ఓ సొత్తు. 13 తరాల నుంచి వారసత్వంగా ఆ కుటుంబీకులు ఆ కళను పోషిస్తూ వస్తున్నారు.

బొబ్బిలి రాజసంస్థానాదీశులు రావు శ్వేతాచల పతిరంగారావు సౌజన్యంతో, మక్కువ మండలం వెంకటభైరిపురం గ్రామానికి చెందిన వంకాయల బలరామ భుక్త నుంచి బొంతలకోటి లచ్చన్న ఈ జానపద కళను నేర్చుకున్నారు. అప్పటినుంచి బొంతలకోటి కుటుంబీకులు వారసత్వ సంపదగా ఈ కళను కొనసాగిస్తూ వస్తున్నారు. అమ్మవారి ఉత్సవాల్లో ఈ కళా ప్రదర్శన తప్పనిసరి. ఇటీవల కాలం వరకు బొంతలకోటి సాంబమూర్తి ఈ కళను ప్రదర్శించేవారు. ఆయన అనారోగ్యంతో మృతిచెందాక కుమారుడైన శంకరరావు ఈ కళలో మెలకువలను తెలుసుకున్నారు. తాత ముత్తాతల వారసత్వాన్ని కొనసాగిస్తున్నారు. నేటితరం పిల్లలకు దీనిని నేర్పిస్తున్నారు.

- తూర్పు భాగవతంలో శ్రీకృష్ణుడు-సత్యభామల కలహాన్ని ఇతివృత్తంగా చేసుకొని దాని నేపథ్యంగా సత్యభామ, రాధ, శ్రీకృష్ణుని పాత్రల్లో మగవారే నటిస్తుంటారు. ప్రధాన పాత్రధారులకు వంతలు పాడే వారు (హంగుదారులని కూడా అంటారు). మృదంగం, వాయిద్యం, హార్మోనియం వంటి సంగీత పరికరాలను వినియోగిస్తారు. కళాకారులు చెక్కతో తయారు చేసిన ఆభరణాలను ధరిస్తారు. వేషం కోసం సహజ రంగులనే వినియోగిస్తారు.

కళారంగంలో కరుణకుమార్..

- వెయ్యికిపైగా ప్రదర్శనలు
- కోలాటంలో విద్యార్థులకు శిక్షణ


కోలాటంలో విద్యార్థినులకు శిక్షణ ఇస్తున్న కరుణకుమార్

బొబ్బిలి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పట్టణంలో మల్టీ టాలెంట్ శిక్షణ కేంద్రాన్ని (ఏబీసీ డాన్స్ అకాడమీ) ఏర్పాటు చేసి విద్యార్థులకు కోలాటంతో పాటు వివిధ నృత్యాల్లో శిక్షణ ఇస్తున్నారు కరుణకుమార్. ఈయన స్వగ్రామం పార్వతీపురం మన్యం జిల్లా బలిజిపేట మండలం నారాయణపురం. 1999లో బుర్రకథ కళాకారునిగా ప్రస్థానాన్ని ప్రారంభించిన కరుణకుమార్ అంచెలంచెలుగా ఎదిగి, కళారంగంలో తనకంటూ ప్రత్యేక ముద్రను ఏర్పరుచుకుంటున్నారు. ఆయన ఒకపక్క బాలనాగమ్మ బుర్రకథలో బాలవర్ధన రాజుగా, మరోపక్క మరగాళ్ల బిందెల డ్యాన్స్‌లో శ్రీకృష్ణునిగా నటిస్తూ, ఇంకొకపక్క కోలాటం ప్రదర్శనలు ఇస్తున్నారు. బలిజిపేట నుంచి ముంబై వరకు మొత్తం వెయ్యికి పైగా ప్రదర్శనలిచ్చారు. వందలాది సత్కారాలు పొందారు. పోలీసు శాఖ నిర్వహిస్తున్న సంకల్పం కార్యక్రమంలో కరుణకుమార్ తమ కళాకారులతో సామాజిక చైతన్య ప్రదర్శనలు ఇస్తున్నారు.

ఏకలవ్య విద్యగా కొరియోగ్రఫీ నేర్చుకున్నా..



ఏకలవ్య విద్యగా నేను కోలాటంతో పాటు రకరకాల డ్యాన్స్‌లకు కొరియోగ్రాఫర్‌ను కాగలిగాను. నేటి ఆధునిక జీవనశైలిలో జనం అభిరుచికి అనుగుణంగా, సంప్రదాయరీతులకు ఎటువంటి భంగం కలగని రీతిలో జానపద కళారూపాలకు ఆధునికతను జోడిస్తున్నాను. దీనికి విశేషమైన ఆదరణ లభిస్తోంది.

-కరుణకుమార్, కోలాటం నృత్య దర్శకుడు

గరివిడి లక్ష్మీ బుర్రకథకు విశేష ఆదరణ..


గరివిడి లక్ష్మీ

రాజాం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ఓ జానపద సినీ గేయంతో తాజాగా గరివిడి లక్ష్మీ సినిమా జిల్లా పేరును అన్ని ప్రాంతాల్లో చాటుతోంది. ఒకప్పుడు పల్లె పల్లెన వినిపించే ఆమె బుర్రకథను ఓ సినిమాగా తెస్తుండడంతో అందరిలో ఉత్కంఠ నెలకొంది. ఈ కళారూపంతో పాటు జిల్లాలో ఎన్నో కళలు పుట్టాయి.. వికసించాయి.. ఆధునిక రూపాన్ని సంతరించుకున్నాయి. గరివిడికి చెందిన బుర్రకథ దళంలో లక్ష్మీ వచనం ద్వారా నర్సింగరావు హాస్యంతో ఆకట్టుకునేవారు. 90వ దశకంలో గరివిడి లక్ష్మీ బుర్రకథ చూడటానికి ప్రజలు బారులుతీరేవారు. 1996లో విశాఖకు చెందిన శ్రీమాతా మ్యూజిక్ హౌస్ గరివిడి లక్ష్మీ బుర్రకథతో పాటు నవ్వులబండి అనే ఆల్బమ్‌ను రికార్డు చేసింది. 'కాలిపోతుంది నాదో'..'నలజిలకర్ర మొగ్గ'.. లాంటి ఎన్నో పాటలు సూపర్ హిట్‌గా నిలిచాయి. గరివిడి లక్ష్మీ బుర్రకథ అంటే ఉత్తరాంధ్రలో చాలా క్రేజ్. తెలుగువారు స్థిరపడిన ప్రతిచోట అప్పట్లో ఈ బుర్రకథ ప్రదర్శితమయ్యేది. సాధారణంగా కళాకారుడు ఏడాదికి 100 వరకూ ప్రదర్శనలిస్తే గొప్ప. అటువంటిది గరివిడి లక్ష్మీ ఏడాదిలో 365 రోజులూ ప్రదర్శనలిచ్చారంటే ఆమెకు ఎంత ఆదరణ ఉండేదో అర్థం చేసుకోవచ్చు. అమెరికాలో ఈ బుర్రకథ పాటల క్యాసెట్లు విపరీతంగా అమ్ముడయ్యాయి.

రైలులో పాటలతో అసిరయ్యకు గుర్తింపు..


అసిరయ్య

'బావొచ్చాడోలప్ప.. బావొచ్చాడు.. ఎంతబావున్నాడోలప్ప బాగున్నాడు'.. లాంటి అనేక పాటలు దశాబ్ద కాలం కింట విశాఖ నుంచి పలాస వైపు వెళ్లే ప్యాసింజర్ రైలులో వినిపించేవి. జానపదాలకు కాస్త ఆదరణ తగ్గిన ఆ రోజుల్లో ఓ పేద కళాకారుడు రైళ్లలో ఈ పాటలు పాడుతూ యాచన చేస్తుండేవారు. కాలం మారింది.. ఆయనే నేడు జనం మెచ్చిన గాయకుడిగా మారారు సంతకవిటి మండలం వాల్తేరు గ్రామానికి చెందిన బోనెల అసిర య్య. ఎటువంటి చదువు లేకపోయినా వాడుక భాషలో ఉండే పదాలను జత కూర్చుతూ జముకు కళను నేర్చుకున్నాడు. జముకు కళకు ఆదరణ తగ్గడంతో ప్రతిరోజూ పొందూరు నుంచి పలాస వెళ్లే ప్యాసింజర్ రైళ్లు.. విశాఖ వైపు వెళ్లే రైళ్లలో జముకుతో జానపదాలు పాడుతూ రోజుకు రూ.300 నుంచి రూ.400 వరకూ సంపాదించేవాడు. తొలిసారిగా విశాఖలోని శ్రీమాతా రికార్డింగ్ కంపెనీలో పాట పాడాక ఆయన దశ తిరిగింది. నేడు గ్రామ గ్రామాన ఆయన పాట పాడుకుంటున్నారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన దర్శకుడు కద్దాల కిరణ్‌కుమార్ దర్శకత్వంలో వచ్చిన 'పలాస 1978' సినిమాలో పాడే అవకాశం పొందారు.

జానకిరావు సైతం..


జానకిరావు

ఉత్తరాంధ్రలో జానపదాలకు ఒక ఊపు తెచ్చింది రేలారేలా కళాకారుడు కోరాడ జానకిరావు. చిన్నవయసు నుంచే జానపదాలపై ఆసక్తి పెంచుకున్న జానకిరావు పాఠశాల స్థాయిలోనే సత్తాచాటాడు. చదువు కొనసాగిస్తూనే గజ్జె కట్టి పల్లె పదాన్ని అలవోకగా పాడాడు. మెంటాడ మండలం వేమలికి చెందిన జానకిరావుది సామాన్య కుటుంబం. తల్లిదండ్రులు అప్పన్న, పైడితల్లి. ఇద్దరూ వ్యవసాయ కూలీలే. తల్లితో పాటు పెద్దమ్మ వ్యవసాయ పనుల సమయంలో పాడే పాటలు జానకిరావు గ్రహించాడు. అది మొదలు పల్లె పదాలు వినిపిస్తే చాలు పాటగా మలచి పాడేవాడు. అదే ఆయనలో ఉన్న ప్రతిభను ప్రపంచానికి చాటిచెప్పింది. ఉత్తరాంధ్ర జానపదాలంటే జానకిరావు పేరు మార్మోగిపోయేది.

జానపద కళకు సాటి లేదు..

- ప్రముఖ రంగ స్థల దర్శకుడు, నటుడు రౌతు వాసుదేవరావు



జియ్యమ్మవలస, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): 'జానపద కళలు.. ప్రాచీన కాలం నుంచి ఎంతో ఆదరణ ఉన్న ఆణిముత్యాలు. సమాజాన్ని, మానవ నడవడికను మార్చి నూతన ఒరవడికి శ్రీకారం చుట్టిన అద్భుత కళలు.. ఆధునిక ప్రపంచంలో వీటికి ఆదరణ అంతంత మాత్రమే. అందుకే జానపద కళలకు పూర్వ వైభవం తెచ్చే ప్రయత్నం చేస్తున్నాం' అని అంటున్నారు ప్రముఖ జానపద దర్శకులు, నటులు, జాతీయ స్థాయి ఉత్తమ హాస్యనటుడు రౌతు వాసుదేవరావు మాస్టారు. ఆయనతో 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక ఇంటర్వ్యూ.

- **ప్ర:** పార్వతీపురం మన్యం జిల్లాలో జానపద కళల ప్రస్థానం ఎలా?
- **జ:** ఈ జిల్లా జానపద కళలకు ప్రసిద్ధి. తూర్పు భాగవతం, జముకుల కథ, తప్పెట గుళ్లు, వీధి భాగవతాలు, దాసర భాగవతం, హరి కథలు, కొమ్ము దాసర్లు, శివ భాగవతం, గంగా వివాహం, పిట్టల దొర, చక్రాజులు, గొల్ల సుద్దులు, బుర్ర కథలు, చెక్క భజన, బిందెల డ్యాన్సు, కోలాటం, జాలారి భాగవతం, ఉడుపుల పాటలు ఈ జిల్లా నుంచే మొదలయ్యాయి.
- **ప్ర:** మైదాన ప్రాంత జానపద కళారూపాల్లో ముఖ్యమైనవి?
- **జ:** జియ్యమ్మవలస మండలం పాత్రునివలస (చంద్రశేఖరరాజపురం), గంగమ్మపేట గ్రామాలు తప్పెటగుళ్ల కళకు ప్రసిద్ధి. వెంకటభైరిపురం రామజ్యోతి బృందం ఆధ్వర్యంలో జముకుల బుర్రకథ, బల్లకృష్ణాపురం గ్రామం చెక్క భజన, కోలాటం బృందాలు ఇలా ఎన్నో మైదాన ప్రాంత జానపద కళారూపాలు ఉన్నాయి.
- **ప్ర:** జిల్లాలో గిరిజన జానపద కళలు ఉండేవా?
- **జ:** జిల్లాలో గిరిజన కళలు మంచి ప్రాచుర్యాన్ని పొందాయి. వాటిలో థింసా, గజ్జెల నృత్యం, పెళ్లి పాటలు, హాస్య కథలు, కత్తి సాము, కర్ర సాము, శివభాగవతం, సోది ముఖ్యమైన కళలు ఉన్నాయి.
- **ప్ర:** ప్రస్తుతం జానపద కళల పరిస్థితేమిటి?
- **జ:** జానపద కళలు సమాజానికి మూల స్తంభాలు. అయినప్పటికీ వేగంగా మారుతున్న ఆధునిక ప్రపంచంలో వీటికి ఆదరణ అంతంత మాత్రంగానే ఉందనేది ఆందోళన కలిగించే విషయం. ప్రోత్సహించే వారు లేక, కళలకు ఆకర్షితులైన వారు రానురానూ తగ్గిపోతుండటం దీనికి ప్రధాన కారణాలు.
- **ప్ర:** సమాజానికి, యువతకు మీరిచ్చే సందేశం?
- **జ:** జానపద కళలకు పూర్వ వైభవం రావాలంటే యువత ముందుకు రావాలి. వారిని ప్రభుత్వం, సమాజం ప్రోత్సహించాలి. అప్పుడే జానపదకళలు పూర్వ వైభవం సంపాదిస్తాయి.

1,475 దివ్యాంగ పింఛన్ల తిరస్కరణ

- కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న బాధితులు
- 60 ఏళ్లు దాటిన వారికి ఓఏపీ కింద మార్పు
- ఇదీ బొబ్బిలి నియోజకవర్గంలో పరిస్థితి


బొబ్బిలి రూరల్: ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న దివ్యాంగులు

బొబ్బిలి/రూరల్/రామభద్రపురం/బాడంగి/తెర్లాం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): బొబ్బిలి నియోజకవర్గంలో నిర్వహించిన వెరిఫికేషన్‌లో 1475 దివ్యాంగుల పింఛన్ల తిరస్కరణకు గురయ్యాయి. దీంతో బాధితులు ఎంపీడీవో, మునిసిపల్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. వైసీపీ హయాంలో అనర్హులకు దివ్యాంగుల పెన్షన్లను మంజూరుచేశారన్న ఆరోపణల నేపథ్యంలో కూటమి ప్రభుత్వం పింఛన్లు పొందిన వారికి వైకల్యం, సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌ను రెండు, మూడు నెలలుగా నిర్వహించింది. 1475 మందిని అనర్హులుగా నిర్ధారించారు. 40 శాతం లోపు వైకల్యం ఉన్నవారంతా దివ్యాంగుల పింఛన్ అందుకోవడానికి అనర్హులుగా నిర్ధారించి పింఛన్‌ను తిరస్కరిస్తున్నట్లు అధికారులు లేఖలు పంపించారు. బొబ్బిలి మునిసిపాలిటీలో 31 వార్డుల్లో 326 దివ్యాంగ పింఛన్లు అందుతుండగా 220 మంది దివ్యాంగులు 40 శాతంలోపు వైకల్యం ఉన్నట్లు నిర్ధారించి పింఛన్‌కు అనర్హులుగా పేర్కొన్నారు. వీరిలో 28 మందికి 60 ఏళ్ల వయస్సు దాటడంతో వారికి వృద్ధాప్య పెన్షన్ కిందమార్పు చేశారు. ఈనెల 29లోగా రీవెరిఫికేషన్ కోసం మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని అధికారులు పేర్కొనడంతో మునిసిపల్ కార్యాలయానికి, సచివాలయాలకు కలిపి కమిషనర్ లాగిన్‌లో 193 మంది బాధితులు దరఖాస్తు చేసుకున్నారు. రాజాం, గజపతినగరం ఆసుపత్రులకు రోజుకు 50 మంది చొప్పున పంపించి ఇటీవల దివ్యాంగుల వైకల్యం పరీక్షలు నిర్వహించినట్లు కమిషనరు లాలం రామలక్ష్మి తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు తిరస్కారానికి గురైన వారిదరఖాస్తులను సేకరించి మళ్లీ ఆన్‌లైన్‌లో పంపుతున్నట్లు చెప్పారు. అలాగే బొబ్బిలి మండలంలోని 30 పంచాయతీల్లో 1112 పింఛన్లు ఉండగా 499 అనర్హులుగా గుర్తించామని, ఓఏపీగా 101 మార్చామని, ఇప్పటివరకూ 398 దరఖాస్తులు అందాయని ఎంపీడీవో రవికుమార్ తెలిపారు. రామభద్రపురం మండలంలో 243 పింఛన్లకు గాను 187 అనర్హులుగా గుర్తించగా, ఓఏపీగా 56 మార్చగా ఇంతవరకు 144 దరఖాస్తులు అందాయని ఎంపీడీవో సన్యాసిరావు పేర్కొన్నారు. బాడంగి మండలంలో 269 మంది అనర్హులు కాగా, 27 ఓఏపీగా మార్చగా ఇంతవరకు 248 దరఖాస్తులు అందాయని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ చెప్పారు. తెర్లాం మండలంలో మొత్తం దివ్యాంగ పెన్షన్లు 239 కాగా అనర్హులుగా 194 గుర్తించగా, 66 ఓఏపీగా మారినట్లు ఎంపీడీవో రేగు రాంబాబు తెలిపారు.

- రామభద్రపురం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): మండలంలో 243 మంది దివ్యాంగ పింఛన్లు రద్దుచేయడం అన్యాయమని సీపీఎం జిల్లా నాయకుడు బలసా శ్రీనివాసరావు ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం ఇన్‌చార్జి ఎంపీడీవో సన్యాసిరావుకు వినతి పత్రం అందించారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి దివ్యాంగులందరికీ రద్దుచేసిన పెన్షన్లు పునరుద్ధరించాలని కోరారు.
- బొబ్బిలి రూరల్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): అనర్హులుగా గుర్తించిన దివ్యాంగ పింఛనర్లు గురువారం బొబ్బిలి ఎంపీడీవో పి.రవికుమార్‌కు వినతి పత్రాలు అందజేశారు.

నీరు నిల్వ లేకుండా చూడాలి

- కలెక్టర్ అంబేడ్కర్


మాట్లాడుతున్న కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం కలెక్టరేట్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నీటి నిల్వలు లేకుండా చూడాలని, దోమల నివారణకు మందులు స్ప్రే చేయాలని కలెక్టర్ డా.బీఆర్ అంబేడ్కర్ ఆదేశించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, సీసీఎల్ఏ స్వామిత్ర కలిసి జిల్లా కలెక్టర్లతో గురువారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల్లో స్వచ్ఛాంధ్ర సంస్థలు, డ్వాక్రా మహిళలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనేలా చూడాలన్నారు. అక్టోబరు 2న స్వచ్ఛ ఆంధ్ర అవార్డులు ఇవ్వనున్నట్టు సీఎస్ తెలిపారు. అనంతరం సీసీఎల్ఏ మాట్లాడుతూ స్వామిత్వ భూమి రికార్డులు సర్వే పనులు త్వరితగతిన పూర్తి చేయాలని, వర్క్ ఫ్రమ్ హోం కౌశల సర్వేను కూడా ఆలస్యం లేకుండా ముగించాలన్నారు. 12 విభాగాల వారిగా రేటింగులు ఇవ్వాలని, సేవా సంస్థలను భాగంగా చేయాలని కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం కలెక్టర్.. జిల్లా అధికారులతో సమీక్షించారు. ఈనెల 23న 4వ శనివారం సాసాలో భాగంగా స్వచ్ఛాంధ్రా కార్యక్రమాలు కార్యక్రమాలకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. నీటి నాణ్యతలను పరీక్షించాలని, పాఠశాలల్లో చేతుల శుభ్రతపై అవగాహన కల్పించాలని ఆదేశించారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

రామభద్రపురం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): తారాపురం గ్రామానికి చెందిన ఓ మహిళ గురువారం తెల్లవారుజామున అనుమానాస్పద స్థితిలో మృతిచెందినట్లు ఏఎస్ఐ అప్పారావు తెలిపారు. గ్రామానికి చెందిన తుమరాడ శ్యామల(41)కు జన్నివలస గ్రామానికి చెందిన ఓ వ్యక్తితో వివాహం జరిగిందని, రెండేళ్లలోపే ఇద్దరూ విడిపోయారని చెప్పారు. అప్పటి నుంచి తారాపురంలోని కన్నవారి ఇంట్లో నివసిస్తోందని తెలిపారు. అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తితో వివాహేతర సంబంధం గతంలో ఉందని చెప్పారు. అయితే గురువారం తెల్లవారుజామున పురుగుల మందు సేవించిన ఆనవాలు ఉన్నాయని, ఇదే కారణంతో దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నట్టు కేసు నమోదు చేశామని, మృతదేహాన్ని బాడంగి సీహెచ్‌సీకి తరలించామని చెప్పారు.

ఐటీడీఏ ఇన్‌చార్జి పీవోగా స్వప్నిల్ జగన్నాథ్

సీతంపేట రూరల్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): సీతంపేట ఐటీడీఏ ఇన్‌చార్జి పీవోగా పాలకొండ సబ్‌కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్‌కు అదనపు బాధ్యతలు (ఎఫ్ఏసీ) అప్పగిస్తూ గురువారం పార్వతీపురం మన్యం కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. పాలకొండ సబ్‌కలెక్టర్‌గా ఈనెల 11న బాధ్యతలు చేపట్టిన స్వప్నిల్ ఇకపై సీతంపేట ఇన్‌చార్జి పీవోగా అదనపు బాధ్యతలు నిర్వహించనున్నారు. గతంలో ఇన్‌చార్జి పీవోగా పనిచేసిన యశ్వంత్‌కుమార్‌రెడ్డికి ఇంతవరకు ప్రభుత్వం ఎక్కడ పోస్టింగ్ ఇవ్వలేదు.

ఆక్రమణల తొలగింపు

మెంటాడ, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): బిరసాడవలస పంచాయతీ సమీపంలోని విజయ హేచరీస్ పేరుతో నిర్వహిస్తున్న కోళ్లఫారం కారణంగా కాలుష్యం సమస్యలు తలెత్తుతున్నాయని ఇటీవల ఆందోళనలు చేపట్టారు. ఈక్రమంలో కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు విచారణ చేపట్టగా, ఈ విచారణలో మొత్తం దాదాపు 3.57 ఎకరాల మేర ఇరిగేషన్, ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైనట్టు గుర్తించారు. కోళ్లఫారం యాజమాన్యం సర్వే నెంబరు 367-2లో 1.23 ఎకరాలు, ఈ కోళ్లఫారానికి వ్యతిరేకంగా ఆందోళనకు దిగిన నలుగురు వ్యక్తులు సర్వే నెం.366, 372లలో 2.33 ఎకరాల భూమిని ఆక్రమించినట్టు గుర్తించారు. వీరికి రెవెన్యూ అధికారులు నోటీసులు కూడా జారీ చేశారు. ఈ మేరకు కోళ్లఫారం లోపలి భాగంలో ఉన్న ఆక్రమణల స్వాధీనానికి మొదటిగా కోళ్లఫారం ప్రహరీని తొలగించారు. రైతుల ఆక్రమణలో ఉన్న భూమి స్వాధీనానికి చర్యలు చేపట్టారు.

పశు వైద్య కేంద్రానికి భవనం మంజూరు చేయాలి

రేగిడి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): తమ గ్రామంలో మండలానికే మెట్టమొదటగా 1987లో నిర్మించిన గ్రామీణ పశువైద్యకేంద్రం శిథిలమైందని, భవనం మంజూరు చేయాలని పనసలవలస గ్రామానికి చెందిన నాయకులు, రైతులు డిమాండ్ చేశారు. గురువారం ఈ శిథిల భవనం వద్ద వారు ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామ సచివాలయంలో గత ఆరేళ్లుగా ఈ భవనం నిర్వహణ కొనసాగుతున్నా దీనిపై సరైన చర్యలు లేకపోవటం శోచనీయం అన్నారు.

ఎస్సీ యువతకు డ్రైవింగ్ శిక్షణ

విజయనగరం కలెక్టరేట్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): షెడ్యూల్డ్ కులానికి చెందిన యువతకు హెవీ మోటర్ వాహనాల డ్రైవింగ్ శిక్షణ ఇస్తామని కలెక్టర్ డా.బీఆర్ అంబేడ్కర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన యువకులు ఈనెల 21లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

108 శివ లింగాలకు ప్రత్యేక పూజలు



పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

కొత్తవలస, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): తుమ్మికాపల్లి గేట్ సమీపంలో ఉన్న ఓం సదనంలో శ్రావణ మాస శివరాత్రి సందర్భంగా గురువారం 108 శివలింగాలకు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలను నిర్వహించారు. ఇందులో భాగంగానే రుద్రహోమం, పుష్పార్చన చేశారు. ఓ సదనం వ్యవస్థాపకుడు అంపోలు ఉమామహేశ్వరశర్మ, సదనం అర్చకుడు కిరణ్‌కుమార్‌శర్మ, భక్తులు పాల్గొన్నారు.

పవిత్ర ఉత్సవాలు ప్రారంభం

జామి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నంరాజుపేట పుష్పగిరి వేణుగోపాల స్వామి ఆలయంలో గురువారం నుంచి పవిత్ర ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా ఆలయంలో కొలువైన వేణుగోపాలునికి ప్రత్యేక పూజలు చేశారు. వేద పారాయణం, హోమాలు చేశారు. ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు. భక్తులు హాజరయ్యారు.



ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

వేతనాలు పెంచండి

● సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీ కార్యకర్తల నిరసన

గజపతినగరం, శృంగవరపుకోట, లక్కవరపుకోట, రేగిడి, కొత్తవలస, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీ కార్యకర్తలు గురువారం నిరసన చేపట్టారు. తమ వేతనాలు పెంచాలని, ముఖ ఆధారిత యాప్‌లు రద్దు చేయాలని కోరారు. తమకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని, గ్రాట్యూటీ జీవోలో మార్పులు వంటి సమస్యలకు పరిష్కారం చూపాలని కోరారు. యూనియన్ నాయకులు పాల్గొన్నారు.



గజపతినగరం: ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు



ఎస్.కోట: గాంధీజీ విగ్రహానికి వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

అభివృద్ధి, సంక్షేమం కనిపించడం లేదా?

● మాజీ మంత్రి బొత్స వ్యాఖ్యలపై టీడీపీ జిల్లా అధ్యక్షుడు నాగార్జున ధ్వజం

విజయనగరం రూరల్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమం మాజీ మంత్రి బొత్స సత్యనారాయణకు కనిపించడం లేదా.. అంటూ టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున ప్రశ్నించారు. గురువారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. ప్రభుత్వంపై బొత్స చేసిన వ్యాఖ్యలు పూర్తిగా నిరాధారమైనవని ఆక్షేపించారు. మేనిఫెస్టో ప్రకారం ఇప్పటికే 80శాతం హామీలు అమలు చేసిన ఘనత టీడీపీదేనన్నారు. రూ.4వేల పింఛన్ కనిపించలేదా.. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాల కింద లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు జమ కావడం వాస్తవం కాదా.. గతంలో వైసీపీ నిలిపివేసిన అన్నా క్యాంటీన్లను పునరుద్ధరించిన సంగతి తేలీదా.. అని ఆయన ప్రశ్నించారు. ఇటీవల మహిళలకు ఆర్టీసీ ఉచిత ప్రయాణం కూడా అమలు చేశామన్నారు. ఇవన్నీ వైసీపీ నాయకులకు తెలియదా.. అంటూ నాగార్జున బొత్స వ్యాఖ్యలను తప్పుపట్టారు. శాంతిభద్రతలు బాగోలేవంటూ బొత్స చేసిన వ్యాఖ్యలు పూర్తిగా అవాస్తవమన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఎవరికీ మాట్లాడే స్వేచ్ఛ కూడా లేదన్నారు. ఉపాధ్యాయుల యూనియన్ల ఫోన్లు ట్యాప్ చేసిన ఘనత వైసీపీకే దక్కిందన్నారు. ఓ డాక్టరు మాస్క్ అడిగితే, ఆయన మరణానికి వైసీపీ కారణం కాదా? ఓ ఎమ్మెల్సీ.. డ్రైవర్‌ని చంపేసి డోర్ డెలివరీ చేసిన ఘనత కూడా వైసీపీదేనని అన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు ఐవీపీ రాజు, విజ్జపు ప్రసాద్, ప్రసాదుల ప్రసాద్, కంది మురళీనాయుడు, ముద్దాడ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు నాగార్జున

నేడు డయల్ యువర్ ప్రజా రవాణాధికారి

విజయనగరం రింగురోడ్డు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆర్టీసీ ప్రజా రవాణాధికారి శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకూ డయల్ యువర్ ప్రోగ్రాం నిర్వహిస్తామని జిల్లా ప్రజా రవాణాధికారిని జి.వరలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్త్రీశక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించినా నేపథ్యంలో జిల్లా బస్సుల్లో ప్రయాణించే ప్రయాణీకుల స్పందన తెలుసుకునేందుకు అలాగే, ఏమైనా ఇబ్బందులు ఎదురైతే, తెలుసుకునేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. 99592 25604 నెంబరుకు ఫోన్ చేసి సమస్యలను తెలియజేయాలని కోరారు.

మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం

విజయనగరం రింగురోడ్డు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థలో ఆర్థిక వనరులను పరిపుష్టి చేసుకుంటేనే ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించేందుకు అధిక ప్రాధాన్యత ఇస్తామని నగరపాలక సంస్థ సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు తెలిపారు. నగరంలోని డివిజన్ పర్యటనలో భాగంగా 46వ డివిజన్ కణపాకలో పర్యటించారు. క్షేత్రస్థాయిలో సమస్యలను అడిగితెలుసుకున్నారు. వీధి దీపాలు సరిగ్గా లేవని, కాలువలు మరమ్మతులకు గురయ్యాయని స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. వీధుల్లో భవన నిర్మాణ సామగ్రిని వేయడాన్ని గమనించి సచివాలయ కార్యదర్శిని మందలించారు. తక్షణమే నిర్మాణ సామగ్రిని తొలగించి రహదారి సౌకర్యాన్ని పునరుద్ధరించాలని సూచించారు. కార్యక్రమంలో నగరపాలక, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

స్థానిక నాయకులతో చర్చించరా?

ఎస్.కోట రూరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): స్థానికంగా ఉండే పదవుల కేటాయింపులో ఆయా ప్రాంతాల నాయకులతో చర్చించరా.. అంటూ బొడ్డవర, ముషిడిపల్లి, పెదఖండేపల్లి, కిల్తం పాలెం పంచాయతీల టీడీపీ నాయకులు, కార్యకర్తలు స్థానిక ప్రజాప్రతినిధులను, పార్టీ ముఖ్య నేతలను ప్రశ్నించారు. కిల్తంపాలెం పంచాయతీలో వారు గురువారం మాట్లాడారు. కొద్దిరోజుల కిందట కృష్ణమహంతిపురం పీఏసీఎస్ చైర్మన్ పదవిని కేటాయించారని, అయితే ఈ సంఘానికి వందలాది మంది సభ్యులు ఉన్న బొడ్డవర, కిల్తంపాలెం, పెదఖండేపల్లి పంచాయతీలలో సభ్యులు, టీడీపీ నాయకులను కాదని కేవలం 16 ఓట్లు ఉన్న ప్రాంత నాయకుడికి ఎలా ఇస్తారని ప్రశ్నించారు.

పింఛన్ పునరుద్ధరించాలని వినతి

దత్తిరాజేరు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): రద్దు చేసిన పింఛన్లను పునరుద్ధరించాలని కోరుతూ మండలంలోని పలువురు దివ్యాంగులు ఇన్‌చార్జి ఎంపీడీవో శివాజీకి గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు ఎంపీడీవో మాట్లాడుతూ 190 పింఛన్లను రద్దు చేస్తూ తమకు నోటీసులు వచ్చాయని, వాటిని వారికి అందజేశామని తెలిపారు.

గోతులు పూడ్చకపోతే బస్సులు నడపలేం

రాజాం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): రాజాం- పాలకొండ ప్రధాన రహదారిలో ఏర్పడిన గుంతలు పూడ్చకపోతే బస్సులు నడపడం కష్టతరంగా ఉందని ఏపీపీటీడీ ఎంప్లాయీస్ యూనియన్ జోనల్ కన్వీనర్ బాసురు కృష్ణమూర్తి ఆవేదన వ్యక్తంచేశారు. పాలకొండ ఎంప్లాయీస్ యూనియన్ రాజాం కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. పాలకొండ నుంచి చీపురుపల్లి వెళ్లే రహదారిలో చాలా చోట్ల గోతులు ఏర్పడ్డాయని, బస్సులు ఎక్కడ పడిపోతాయో తెలియని పరిస్థితి ఉందన్నారు. ఈ గోతులు పూడ్చకపోతే బస్సులు నడపడం సాధ్యం కాదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల ఉచిత బస్సు ప్రయాణం అమలు చేయడంతో అధికంగా మహిళలు ప్రయాణం చేస్తుండడంతో ఓవర్ లోడు అవుతున్నాయని, ఈ గోతుల్లో బస్సులు నడపడం చాలా కష్టంగా ఉందని తెలిపారు. ఈ గోతుల వల్ల ఎటువంటి ప్రమాదాలు జరిగినా తమకు సంబంధం లేదన్నారు. యూనియన్ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీపీటీడీ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విజయనగరం రింగురోడ్డు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): నగరంలోని పూల్‌బాగ్ సెక్షన్ పరిధిలో చెట్టు కొమ్మలు తొలగించే క్రమంలో శుక్రవారం ఉదయం విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఆపరేషన్ ఈఈ త్రినాథ్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పిలి వీధి, బుంగ వీధి, సౌత్ ఇండియా షాపింగ్ మాల్, కోలగట్ల వారు వీధి, కొణిశ వీధి, అద్దెపల్లెవారు వీధిలో ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. అలాగే పూల్‌బాగ్ ఫీడర్ పరిధిలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ పూల్‌బాగ్ కాలనీ, మంగళవీధి కాలనీ, ప్రేమసమాజం, విజయలక్ష్మీనగర్, కొత్తపేట, యాదవ వీధి, స్వీపరు కాలనీ, కుమ్మర వీధి ప్రాంతాల్లో నిలుపుదల చేయనున్నామని చెప్పారు. ● డెంకాడ: మండలంలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్టు ఈఈ జి.సురేష్‌బాబు గురువారం తెలిపారు. బొడ్డవలస, వెలమపేట, చెల్లూరు ఇండస్ట్రియల్ ఏరియా, జొన్నాడ, లెండీ కాలేజీ పరిసరాల్లో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్‌కు అంతరాయం కలగనుందన్నారు. ● దత్తిరాజేరు: కోమటిపల్లి 33కేవీ ఫీడర్ గర్భాం నుంచి కోమటిపల్లి వరకు, పోరలి నుంచి జిన్నాం వరకు శుక్రవారం విద్యుత్‌ను నిలిపివేస్తున్నామని ఈఈ బి.రఘు తెలిపారు. ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని చెప్పారు. ● గంట్యాడ: గింజేరుకు వెళ్లే విద్యుత్ లైన్ల పరిధిలో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈఈ పి.త్రినాథ్ తెలిపారు. ● భోగాపురం: మండలంలోని కొన్ని గ్రామాల్లో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని ఏఈ మస్తాన్‌వల్లి తెలిపారు. సవరవల్లి, ఉప్పాడసేట, రావాడ, బసవపాలెం, తూడెం, కవులవాడ గ్రామాల్లో మధ్యాహ్నం 2 గంటల వరకు, గుడివాడ, ఇరుసుపేట, మద్దిపేటల్లో మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్తు నిలుపుదల చేస్తామన్నారు.

ఎంపీడీవో కార్యాలయ ప్రహరీ కూల్చివేత

చీపురుపల్లి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): చీపురుపల్లి ఎంపీడీవో కార్యాలయం వెనుక వైపు ఉన్న ప్రహరీని కొందరు వ్యక్తులు కూల్చివేశారు. కార్యాలయం వైపున ఉన్న స్థలాన్ని కూడా ఎక్సకవేటర్‌తో చదును చేశారు. ఆ గోడకు ఆనుకుని ఉన్న శ్మశాన వాటికలో ఇటీవల అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఈ పనుల్లో భాగంగా శ్మశాన వాటికకు, ఎంపీడీవో కార్యాలయానికి మధ్యనున్న ప్రహరీని కొందరు వ్యక్తులు కూల్చి వేసి, కార్యాలయానికి చెందినదిగా భావిస్తున్న స్థలాన్ని చదును చేశారు. సమాచారం తెలుసుకున్న ఎంపీడీవో ఐ.సురేష్ గురువారం ఆ స్థలాన్ని సందర్శించారు. తమ కార్యాలయానికి పశ్చిమంగా ఉన్న ప్రహరీని కూల్చివేయడం వాస్తవమేనని, స్థలాన్ని చదును చేసే పనులు నిలిపివేయాల్సిందిగా ఆదేశించామని చెప్పారు. అయితే, కార్యాలయానికి చెందిన స్థలంలో సర్వే చేసిన అనంతరం, అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

కొత్తవలస, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కొత్తవలస పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్ ఎంపీపీ నీలంశెట్టి గోపెమ్మ అన్నారు. గురువారం స్థానిక పీహెచ్‌సీలో ఆమె అధ్యక్షతన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కొత్తవలస పీహెచ్‌సీకి సంబంధించిన నూతనంగా నిర్మిస్తున్న భవనాలు మధ్యలో నిలిచిపోయాయని, వీటిని పూర్తి చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఆసుపత్రి అభివృద్ధి కోసం అర్ధ సంవత్సరానికి మంజూరైన రూ.44వేలను ఏ విధంగా ఖర్చు చేయాలనే విషయమై చర్చించారు. వైద్యాధికారిణి సీతల్‌వర్మ, కొత్తవలస సర్పంచ్ రామస్వామి, ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీదేవి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

గజపతినగరం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): విద్యా రంగ సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు డి.రాము డిమాండ్ చేశారు. గురువారం స్థానిక నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద విద్యార్థులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. డిగ్రీ విద్యార్థులకు స్కాలర్‌షిప్ బకాయిలు చెల్లించాలని కోరారు. డిగ్రీ కళాశాలకు ప్రభుత్వం స్థలం సేకరించినా నిర్మించకపోవడం శోచనీయం అన్నారు. వసతి గృహాల్లో ఉన్న విద్యార్థులకు మెస్ చార్జీలు పెంచాలన్నారు. ● రాజాం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సొంత భవనం ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద మానవహారంగా ఏర్పడ్డారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు పి.రమేష్ తదితరులు పాల్గొన్నారు. ● చీపురుపల్లి: చీపురుపల్లిలోని మూడు రోడ్ల కూడలిలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులంతా మానవహారంగా ఏర్పడ్డారు. అనంతరం స్థానిక తహసీల్దార్ ధర్మరాజుకు వినతిపత్రం అందజేశారు.



చీపురుపల్లి: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థులు



గజపతినగరం: నిరసన చేస్తున్న విద్యార్థులు



రాజాం: మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు

గుళికలు కొంటేనే యూరియా!

● ఇబ్బందులు పడుతున్న రైతులు

గజపతినగరం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): రైతులకు ఎరువుల కష్టాలు తప్పడంలేదు. గత నాలుగు రోజుల కిందట అల్పపీడనం కారణంగా కురిసిన వర్షాలకు ఉభాలు ఊపందుకున్నాయి. రైతులకు అవసరమైన యూరియా, డీఏపీ కోసం రైతులు అష్టకష్టాలు పడాల్సి వస్తోంది. మండలంలోని ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 3,691 హెక్టార్లలో రైతులు వరి సాగు చేస్తున్నారు. మండలానికి 780 టన్నుల యూరియా, 630 టన్నుల డీఏపీ తీసుకువచ్చినట్టు అధికారులు చెబుతున్నారు. యూరియా బస్తా రూ.267 కాగా, నానో యూరియా రూ.240కు విక్రయిస్తున్నారు. అలాగే డీఏపీ బస్తా రూ.1350 కాగా, నానో డీఏపీ రూ.590కి రైతులకు అమ్మకాలు చేపట్టాలి. అయితే ప్రైవేటు డీలర్లు మాత్రం గుళికలు తీసుకుంటేనే గానీ యూరియా ఇచ్చేది లేదని తెగేసి చెప్పడంతో రైతులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. అవసరం లేకపోయినా రూ.500 విలువ చేసే గుళికలు అట్టగట్టడం తగదని వాపోతున్నారు. దీనిపై ఎవరూ పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రైతులకు అవసరమైన యూరియా కూడా ఎకరానికి ఒక బస్తా, రెండో బస్తా కావాలంటే నానో డీఏపీ అందజేస్తున్నారని రైతులు వాపోతున్నారు.

అంతంతమాత్రంగా తనిఖీలు

షాపుల్లో ఆన్‌లైన్ ద్వారా అమ్మకాలు చేపట్టాలని, అధిక ధరలకు ఎరువులు విక్రయించరాదని, సంబంధిత అధికారులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. అయినా డీలర్లు రైతులకు మభ్యపెడుతూ వారికి అవసరం లేని గుళికలను, జింక్‌ను అంటగడుతున్నారు. ఇతర ప్రాంతాల నుంచి ఏడీఏలు వస్తున్నారని ముందుగా తెలుసుకుని కొంతమంది డీలర్లు షాపులను మూసి వేస్తున్నారు. దీంతో పరిశీలనకు వచ్చిన అధికారులు ఉన్న షాపులను చూసుకుని వెళ్లిపోతున్నారు.

రైతులకు ఇబ్బందులు పెట్టవద్దు

రైతులను డీలర్లు ఇబ్బందులకు గురి చేస్తే సహించేది లేదు. గుళికలకు యరియాకు లింక్ పెట్టి అమ్మకాలు చేపట్టరాదు. రైతులు నేరుగా తమకు సమాచారం అందజేయాలి. రైతులకు అవసరం అనుకుంటేనే గుళికలు ఇవ్వాలి. రైతులు నానో డీఏపీ, నానో యూరియా వాడకం పెంచుకోవాలి. దీనివల్ల నగదు ఆదాతో పాటు పంటకు ఈ ఎరువులు ఉపయుక్తంగా ఉంటాయి.

- కిరణ్‌కుమార్, మండల వ్యవసాయ అధికారి, గజపతినగరం

రూ.100 కోట్లతో పొగాకు కొనుగోలు

● మార్క్‌ఫెడ్ చైర్మన్ బంగార్రాజు



పొగాకును పరిశీలిస్తున్న బంగార్రాజు

విజయనగరం/భోగాపురం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): రైతుల వద్ద రూ.100కోట్లతో మార్క్‌ఫెడ్ సంస్థ ద్వారా 13,100 మెట్రిక్ టన్నుల పొగాకును కొనుగోలు చేశామని ఆ సంస్థ రాష్ట్ర చైర్మన్ కర్రోతు బంగార్రాజు తెలిపారు. రాష్ట్రంలోని గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలోని పెదకాకాణి, చుట్టుగుట్ట, చిలకలూరి పేట, పర్చూరులో జరగుతున్న నల్లబర్రి పొగాకును రైతుల నుంచి కొనుగోలు చేస్తున్న కేంద్రాన్ని ఆయన గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అకాలంగా వచ్చిన తుఫాన్ వల్ల బయట గిట్టుబాటు ధర లేక రైతులు ఇబ్బందులు పడుతున్న సందర్భంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాలతో మార్క్‌ఫెడ్ సంస్థ ద్వారా రైతులకు గిట్టుబాటు ధర కల్పించి, పొగాకును కొనుగోలు చేస్తామని తెలిపారు. పొగాకు నాణ్యతను బట్టి మూడు గ్రేడ్‌లుగా విభజించి రైతులకు గిట్టుబాటు ధర ఇస్తామన్నారు. బాపట్ల, పల్నాడు జిల్లాల్లో 7754 మంది రైతుల వద్ద రూ.100కోట్లతో మార్క్‌ఫెడ్ సంస్థ ద్వారా 13,100 మెట్రిక్ టన్నుల పొగాకును కొనుగులు చేశామని తెలిపారు. ఈయన వెంట జనరల్ మేనేజరు శ్రీనివాసరావు, జిల్లా మేనేజర్లు నర్సింహారెడ్డి, రమేష్, కరుణశ్రీ, అధికారులు పాల్గొన్నారు.

ఎందుకు వచ్చినట్టో?

● అధికారుల తీరుపై పెదచామలాపల్లి వాసుల అసంతృప్తి

మెంటాడ, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): పెదచామలాపల్లి గ్రామాన్ని సందర్శించిన అధికారుల తీరుపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేశారు. జడ్పీ సీఈవో సత్యనారాయణ, ఎంపీడీవో భానుమూర్తి, ఈవోపీఆర్డీ విమల కుమారి తదితరులు గురువారం పెదచామలాపల్లిని పరిశీలించారు. ఈసందర్భంగా స్థానికులు వారి దృష్టికి పలు సమస్యలను తీసుకువెళ్లారు. పారిశుధ్యం పడకేసి తీవ్ర ఇబ్బందులు ఎదురువుతున్నాయని, అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, క్లోరినేషన్ చేయడం లేదని, వీధి దీపాలు సక్రమంగా వెలగడం లేదని.. ఇలా పలు సమస్యలను ప్రస్తావించారు. దీనిపై సర్పంచ్ బాయి తౌడమ్మ, ఉప సర్పంచ్ బాయి అప్పారావు స్థానికులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వారు చెబుతున్నవన్నీ అవాస్తవమని అన్నారు. స్థానికులతో వాగ్వాదానికి దిగారు. దీన్ని గమనించిన స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు సర్పంచ్ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. స్థానికులు సమస్యలను చెబుతుంటే సర్పంచ్ అడ్డుతగలడంపై అభ్యంతరం తెలపారు. ఈ క్రమంలో వారిపైన కూడా సర్పంచ్ చిర్రుబుర్రులాడారు. దీంతో, అధికారులు అంతటితో వెనక్కి తిరిగి పంచాయతీ కార్యాలయానికి చేరుకుని అట్నుంచి అటే వెళ్లిపోయారు. అసలు అధికారులు ఎందుకు వచ్చినట్టో అంటూ స్థానికులు మండిపడుతున్నారు. అనంతరం గ్రామస్థులు అధికారులకు, సర్పంచ్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

ఫిజియోథెరపీ కోర్సులు ప్రారంభించాలి

విజయనగరం దాసన్నపేట, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రభుత్వ వైద్య కళాశాలలో ఫిజియోథెరపీ, రేడియోగ్రఫీ కోర్సులు ప్రారంభించాలని ఉత్తరాంధ్ర అంబేడ్కర్ రైట్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు పొండ్రంకి వెంకటరమణ కోరారు. వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా.బి.దేవిమాధవిని గురువారం కలిసి వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ వైద్య కళాశాలను 2019లో ప్రారంభించారని, 2023-24 అకాడమీ తరగతులు ప్రారంభమయ్యాయని తెలిపారు. ప్రస్తుతం వైద్య విద్యార్థుల బోధన తరగతులను ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో నిర్వహిస్తున్నారని చెప్పారు. రోజు రోజుకు రోగులు, వైద్యులు, వైద్య విద్యార్థులు, బోధన ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లతో సేవలు అందుతున్న తరుణంలో ఫిజియోథెరపీ రోగుల సంఖ్య, ఎక్స్‌రేల సంఖ్య పెరుగుతుందని ఫిజియోథెరపీ కోర్సులు, కళాశాలలు లేకపోవడం వల్ల ప్రొఫెసర్లు లేరని నాన్ టీచింగ్ ఫిజియోథెరపిస్టులు ఇద్దరు మాత్రమే ఉన్నారన్నారు. తక్షణమే యువతకు ఉపాధి అవకాశాలు పొందేందుకు కోర్సులు ప్రారంభించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గంటా వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

అవసరాలు-అవకాశాలు పుస్తకావిష్కరణ

విజయనగరం దాసన్నపేట, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): పట్టణ పౌర సంక్షేమ సంఘం ముద్రించిన విజయనగరం సమగ్రాభివృద్ధి అవసరాలు-అవకాశాలు అనే పుస్తకాన్ని గురువారం ఆ సంఘ నాయకులు ఆవిష్కరించారు. గురువారం ఎల్‌బీజీ భవనంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎం.శ్రీనివాస్ ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా కార్యదర్శి రెడ్డి శంకరరావు మాట్లాడుతూ విజయనగరం జిల్లా, నగరం అభివృద్ధికి కావలసిన అవసరాలు, ఉపాధి కల్పన కోసం ఏప్రిల్ 5న సెమినార్‌ను నిర్వహించామని చెప్పారు. చర్చించిన అంశాలు ఆధారంగా పుస్తకాన్ని రూపకల్పన చేశామన్నారు. నగర అభివృద్ధికి రూ.10కోట్లు కేటాయించాలని కోరారు. పట్టణ ఉపాధి పథకం, మామిడి, జీడి పరిశ్రమలు ఏర్పాటు చేయడం, మూతపడిన పరిశ్రమలు తెరిపించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. జిల్లా మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. సంఘ ప్రతినిధులు రామచంద్రరావు, అప్లాంలు పాల్గొన్నారు.

డిజిటల్ ఆధారాలతో నేరాల దర్యాప్తును వేగవంతం చేయాలి

విజయనగరం క్రైం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పోలీసు స్టేషన్ పరిధిలోని సాంకేతిక విభాగం (ఐటీ కోర్), సైబర్ నిపుణులు, సిబ్బంది డిజిటల్ ఆధారాలతో నేరాల దర్యాప్తును వేగవంతం చేయాలని ఉబెర్ మేనేజరు ప్రభంజన్‌కుమార్, పబ్లిసేఫ్టీ లైజన్ దీపక్‌రాజ్‌లు అన్నారు. విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టీ ఆదేశాలతో విశాఖ రేంజ్ పరిధిలోని ఐటీకోర్, సైబర్ నిపుణులైన సబ్ ఇన్‌స్పెక్టరు, ఇన్‌స్పెక్టరు, పీసీ, హెచ్‌సీ, 36 మంది అధికారులకు గురువారం కైలాసగిరి పోలీసు విశ్రాంతి భవనంలో ఉబేర్ డేటా డిస్క్లోజర్ పాలసీపై వర్క్‌షాపు నిర్వహించారు. ఈసందర్భంగా ప్రభంజన్‌కుమార్, దీపక్‌రాజ్‌లు మాట్లాడుతూ నేర సంఘటనల విచారణలో మొబైల్ లోకేషన్ ఆధారంగా నేరస్థులను గుర్తించవచ్చునన్నారు. లీగల్ ప్రాసెస్ డేటా రిక్వస్ట్ చేయడం అందుబాటులో సమాచార రకాలు ప్రైవసీ పరిరక్షణపై అవగాహన పెంపొందించుకోవాలని తెలిపారు. నేరాల నియంత్రణను సాంకేతికత ఆధారంగా త్వరితగతిన ఫలితాలు సాధించవచ్చునన్నారు. ఐటీకోర్, సైబర్ నేరాల నిపుణులు, అధికారులు పాల్గొన్నారు.

జిందాల్ భూ నిర్వాసితులను పట్టించుకోరా?

శృంగవరపుకోట ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): జిందాల్ భూ నిర్వాసితులను ప్రభుత్వం పట్టించుకోకపోవడం అన్యాయమని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. న్యాయం కోసం 60 రోజులుగా భూ నిర్వాసితులు నిరసనలు చేస్తున్నారన్నారు. 2007లో భూ సేకరణ సమయంలో మార్కెట్ వాల్యూ ప్రకారం నష్టపరిహారం చెల్లించకుండా ఎస్సీ, ఎస్టీ, బీసీ రైతులను జిందాల్ యాజమాన్యం మోసం చేసిందన్నారు. ఎకరాకు రూ.2లక్షల500 మాత్రమే చెల్లించిందన్నారు. పరిశ్రమను నిర్మించకపోవడంతో పాటు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా నిర్వాసిత రైతులను ఇబ్బందులకు గురి చేశారన్నారు. జిందాల్ భూ నిర్వాసితులకు అండగా సంతకాలను సేకరిస్తామని తెలిపారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘురాజు

నాయకులారా.. మీ జాడ ఎక్కడ?

ఎస్.కోట రూరల్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): హరిజన, గిరిజన సంఘ నాయకులమని చెప్పుకుంటూ పెద్దపెద్ద ఉపన్యాసాలు ఇచ్చే నాయకులు ఎక్కడ.. అంటూ జిందాల్ నిర్వాసితులు ప్రశ్నించారు. బొడ్డవర గ్రామంలో 60వ రోజు గురువారం వారంతా నిరసన చేపట్టారు. జిందాల్ యాజమాన్యంపై ఇన్ని రోజులుగా పోరాటం చేస్తుంటే.. తమకు అండగా నిలవాల్సిన నాయకుల జాడే కనిపించడం లేదని వాపోయారు.



నిరసన తెలియజేస్తున్న జిందాల్ నిర్వాసితులు

డీజేలను వినియోగించవద్దు: సీఐ



డీజే నిర్వాహకులతో మాట్లాడుతున్న సీఐ మురళీధర్,ఎస్ఐ గోవిందరావు

పార్వతీపురంటౌన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురంలో వినాయక చవితి, దసరా ఉత్సవాలను నిర్వహించే నిర్వాహకులు డీజేలతోపాటు అధిక శబ్దాలను ఇచ్చే పరికరాలను వినియోగించవద్దని పట్టణ పోలీసు స్టేషన్ సీఐ మురళీధర్ తెలిపారు.పండుగల సందర్భంగా డీజేల వల్ల ఎవరైనా చనిపోతే సంబంధిత యజమానులకు శిక్షతప్పదన్నారు.గురువారం పట్టణ పోలీసు స్టేషన్‌లో డీజేల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వినాయకచవితి, దసరా అనుపోత్సవాల్లో నిబంధనలు పాటించాలన్నారు.కార్యక్రమంలో పట్టణఎస్ఐ గోవిందరావు పాల్గొన్నారు.

అంతర పంటలతో అధిక ఆదాయం

గుమ్మలక్ష్మీపురం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి):పండ్లతోటల్లో అంతర పంటలుగా పసుపు, అల్లం, పైనాపిల్, రాగులు కర్ర పెండలం, జొన్న కంది తీగజాతులు, ఆకుకూరలు వేసుకోవడం వల్ల అధిక ఆదాయం లభిస్తుందని పలువురు వక్తలు తెలిపారు.గురువారం గద్రజోల గ్రామంలో అజీమ్ ప్రేమ్‌జి ఫౌండేషన్ ఆర్థికసాయంతో జట్టుసంస్థ పర్యవేక్షణలో అమలవుతున్న పలు కార్యక్రమాలను జట్టు ట్రస్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్.ప్రహరాజ్, బడి నుంచి పొలంబడి సిలబస్ కన్సల్టెంట్ తుంబలి శివాజీతో కలిసి రైతు కిల్లక సీతారాం అంతరపంటల క్షేత్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో రైతులు భీమారావు, సీతారాం, కోఆర్డినేటర్ గౌరీశంకర్ పాల్గొన్నారు.

ఏనుగుల దాడిలో మొక్కజొన్న పంట ధ్వంసం

కొమరాడ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి):మండలంలోని గంగిరేగువలసలో రైతు కోడి తిరుపతిరావుకు చెందిన మొక్కజొన్నపంటను తొమ్మిది ఏనుగులు గుంపు ధ్వంసం చేయడంతో రైతు కన్నీరుమున్నీరయ్యాడు. ప్రభుత్వాలు మారినా ఏనుగుల సమస్య పట్టించుకోవడం లేదని వాపోయాడు. సుమారు రెండెకరాల మొక్కజొన్నతోటను ధ్వంసం చేసినట్టు ఆవేదన వ్యక్తంచేశాడు.

రహదారికి మరమ్మతులు చేయాలి

పాలకొండ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): పాలకొండ నుంచి రాజాం రూట్‌లో రోడ్డు గతుకులమయంకావడంతో కష్టంగా ఉందని, ప్రభుత్వం వెంటే చర్యలు తీసుకొని రోడ్డును మరమ్మతులు చేయాలని ఏపీపీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ జోనల్ సెక్రటరీ భాసూరు కృష్ణమూర్తి కోరారు. గురువారం పాలకొండలో విలేకరులతో మాట్లాడుతూ పాలకొండ-విశాఖపట్నం రోడ్డులో బస్సులు 400 ట్రిప్పులు వేస్తున్నారని.గోతుల వల్ల బస్సులు పాడవుతున్నాయని తెలిపారు.సమావేశంలో నాయకులు సాగర్, దాము, శ్రీను పాల్గొన్నారు.

సహజ వనరులను ఉపయోగించుకోవాలి

గరుగుబిల్లి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి):గ్రామస్థాయిలో అందుబాటులో ఉండే సహజ వనరులను ఉపయోగించుకోవాలని జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ ఎం.శ్రావణ్‌కుమార్‌నాయుడు తెలిపారు. గురువారం తోటపల్లిలోని ప్రకృతి వనరుల కేంద్రంలో శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలకు సంబంధించిన సిబ్బంది,ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలకు పలురకాల కషాయాలు తయారీపై అవగాహనకల్పించారు. కార్యక్రమంలో తోటపల్లి జట్టు వ్యవస్థాపకులు డి.పారినాయుడు, రైతు సాధికారిక సంస్థ కన్సల్టెంట్ ప్రవీణ్, రమాప్రభ,శిక్షకులు భీమరాజు,అప్పారావు, ఎన్ఎఫ్ఏ జి.అన్నపూర్ణ పాల్గొన్నారు.

సర్వేను వేగవంతం చేయాలి

గరుగుబిల్లి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల్లో స్వామిత్వ సర్వేను వేగవంతం చేయాలని డిప్యూటీ ఎంపీడీవో ఎల్.గోపాలరావు సూచించారు. గురువారం స్థానిక మండల అభివృద్ధి కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాలసిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో ప్రస్తుతం నివాసముండే గృహాలకు శాశ్వత హక్కుతోపాటు ప్రత్యేక గుర్తింపు సంఖ్య కేటాయించాల్సి ఉందన్నారు. వ్యాధులు ప్రబలకుండా, దోమల నివారణకు ఫ్రైడే, డ్రైడేను నిర్వహించాలన్నారు.

పోర్టల్‌లో వివరాలు నమోదు చేయాలి

గరుగుబిల్లి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మన్యం జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల పూర్తిస్థాయి వివరాలు ప్రభుత్వ పోర్టల్‌లో నమోదు చేయాలని టీవోఎఫ్ఈవై జిల్లా నోడల్ అధికారి చొక్కాపు శ్రీనివాసరావు సూచించారు. గురువారం పార్వతీపురం, గరుగుబిల్లి మండలాల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలను పరిశీలించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల పరిధిలో పొగాకు వాడకంలేని కార్యక్రమాలను పోస్టల్ ప్రదర్శనలు, వీధి నాటకాలు, నినాదాలతోపాటు ప్రదర్శనలు, ర్యాలీలు నిర్వహించాలని కోరారు. పాఠశాలల్లో నిర్వహించిన కార్యక్రమాలను ఈనెల 31లోగా ఎంవైజిఓవి.ఐఎన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థుల్లో చైతన్యం తీసుకురావాలని కోరారు. ప్రతిభకనబరిచిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ. 50 వేలు, రూ. 20 వేలు, రూ. 15 వేలు కేంద్ర ప్రభుత్వం అందజేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జి.హేమసుందరరావు పాల్గొన్నారు.

సైబర్ మోసంపై కేసు నమోదు

రాయగడ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): సైబర్‌నేరగాళ్ల వలకు చిక్కి లక్షా 24 రూపాయలు ఓ విశ్రాంత ప్రభుత్వోద్యోగి పోగొట్టుకున్న సంఘటన రాయగడలో చోటుచేసుకుంది. బాధితుడు, పోలీసులకథనం మేరకు.. రాయగడలోని ఇందిరా నగర్ మూడోవీధిలో ఉంటున్న పూర్ణచంద్ర త్రిపాఠి మొబైల్‌కు బుధవారం సాయంత్రం ఓ మెసేజ్‌వచ్చింది. ఆ మెసేజ్ లింకు ఓపెన్ చేయడంతో ఆయన బ్యాంకు ఖాతానుంచి లక్షా 24 వేలు విత్‌డ్రాఅయినట్లు మెసేజ్‌వచ్చింది. దీంతో మోసపోయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదుచేశాడు. బ్యాంకు అధికారులు ఖాతాను తాత్కాలికంగా నిలిపివేశారు.పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'జనవాణి'లో వినతుల స్వీకరణ

పాలకొండ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో గురువారం నిర్వహించిన జనవాణి కార్యక్రమంలో పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ వినతులుస్వీకరించారు.ఈ సందర్భంగాపలువురు తమ సమస్యలను విన్నవించారు. కార్యక్రమంలో జనసేన నేతలు రావి సౌజనయ, రమేష్, రాజా పాల్గొన్నారు.



అర్జీ స్వీకరిస్తున్న జయకృష్ణ

చెరువులకు మహర్దశ

(5వ పేజీ తరువాయి)

సాగునీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోయింది. పలుచోట్ల ఆక్రమణకు గురై చెరువు గర్భాలు కుచించుకుపోయాయి. కూటమి ప్రభుత్వం తర్వాత చెరువులపై ప్రత్యేక దృష్టి పెట్టింది. వంద ఎకరాల ఆయకట్టు ఉన్న చెరువులను అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. వచ్చే ఖరీఫ్ సీజన్‌కు ఈ చెరువులను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి, ఆయకట్టు రైతులకు సాగునీరిచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

ఇరిగేషన్ ట్యాంకులు అభివృద్ధి చేస్తాం :కలెక్టర్

జిల్లాలో మైనర్ ఇరిగేషన్ ట్యాంకుల అభివృద్ధి కోసం రిపేర్ రినోవేషన్ రెస్టోరేష్ (ఆర్‌ఆర్‌ఆర్) కార్యక్రమాన్ని ప్రారంభించనున్న ట్లు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో నీటిపారుదల శాఖ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో మైనర్ ఇరిగేషన్ ట్యాంక్‌ల అభివృద్ధికి సంబంధించి ప్రతిపాదనలను సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ నెల 25 నాటికి కనీసం 25 ట్యాంక్‌ల డీపీఆర్ సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. ఈ పనులు చేపట్టడం వలన భూ గర్భ జలాలు పెరుగుతాయని, వేసవిలో కూడా నీరు ఇంకిపోకుండా ఉండేందుకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడనుందని తెలిపారు. కార్యక్రమంలో జేసీ శోభిక, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

రోడ్లు లేవు.. కాలువలు నిర్మించలేదు



దుగ్గేరులో బురదమయమైన రోడ్డు

- బురదమయమవుతున్న వీధులు
- ఇదీ దుగ్గేరులో పరిస్థితి

మక్కువ రూరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పనసభద్ర పంచాయతీ పరిధిలోగల దుగ్గేరు గ్రామంలో సీసీ రోడ్లు లేకపోవడంతోపాటు కాలువల నిర్మించకపోవడంతో గ్రామస్థులు అవస్థలకు గురవుతున్నారు. 1500 మంది జనాభా గల దుగ్గేరులో మూడు వీధులు ఉన్నాయి. సీసీ రోడ్డు, కాలువలు లేకపోవడంతో వాడుక నీరుతో పాటు వర్షం నీరు కూడా వీధి మధ్యలో నిల్వఉంటోంది. దీనికితోడు గుంతలు ఏర్పడి రెండువీధులు బురదమయమయ్యాయి. వీధుల్లో వాడుక,వర్షం నీరురోజుల తరబడి గుంతల్లో నిలిచిపోవడంతో వ్యాధులు ప్రబలుతాయోమోనని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. పాలకులు మారుతున్నా గ్రామాభివృద్ధికి చర్యలు తీసుకోవడంలేదని పలువురు ఆరోపిస్తున్నారు.ఈపంచాయతీ పరిధిలోని 14 గిరిజనగ్రామాల్లో కూడా రోడ్లు, కాలువలు పూర్తిస్థాయిలో లేకపోవడంతో అగచాట్లు తప్పడం లేదని పలువురు వాపోతున్నారు. కాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దుగ్గేరులోని ప్రధానవీధిలో సీసీ రోడ్డు, కాలువల నిర్మాణానికి 3 లక్షల 50వేల రూపాయలు మంజూరు కాగా పనులు చేపట్టేందుకు ఎవరు ముందుకు రాకపోవడంతో పాటు మెటీరియల్ రేట్లలో తేడావచ్చి పనులు ప్రారంభం కాకపోవడంతో రద్దైనట్లు మండల పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి రంజిత్‌కుమార్ తెలిపారు. కొత్త రేట్లతో తిరిగి ప్రతిపాదనలు పంపామని, మంజూరు కాగానే పనులు మొదలు పెడతామని చెప్పారు.



వీరఘట్టం: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్యకర్తలు



గరుగుబిల్లి: నిరసనతెలుపుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు



సీతానగరం: తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి

- సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ కార్యకర్తల నిరసన

గ్రామాల్లో కార్యకర్తలకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని అంగన్‌వాడీలు కోరారు. పలు సమస్యలు పరిష్కరించాలని గురువారం అంగన్‌వాడీ కార్యకర్తలు నిరసన తెలిపి అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.

●గరుగుబిల్లి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి):వేతనాలు పెంచడంతో పాటు ట్యాబ్‌లు అందించాలని అంగన్‌వాడీ కార్యకర్తల ప్రతినిధులు గౌరమ్మ, సావిత్రి, పి.కృష్ణవేణి డిమాండ్ చేశారు. గరుగుబిల్లిలో కార్యకర్తలు ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ బాలకు వినతిపత్రం అందజేశారు.

●వీరఘట్టం, ఆగస్టు21 (ఆంధ్రజ్యోతి):పనికి తగ్గవేతనం అందజేయాలని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు కోరారు. మొబైల్ యాప్‌లు, బయోమెట్రిక్ విధానం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. గురువారం వీరఘట్టం తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో అంగన్‌వాడీ సిబ్బంది తహసీల్దార్ సాయి కామేశ్వరరావుకు వినతిపత్రం అందించారు.

●సీతానగరం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కార్యకర్తలకు, హెల్పర్లకు వేతనాలు పెంచాలని ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్ల యూనియన్ నాయకులు గంట జ్యోతి, వెన్నెల రామలక్ష్మిలు డిమాండ్ చేశారు.ఈమేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేతనాలు పెంచడంతో పాటు ఎఫ్ఆర్ఎస్ రద్దు చేయాలని,ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలని కోరారు.ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించాలని డీటీ ఉమామహేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు కార్యక్రమంలో ఎం.సత్యవతి, ఎం.సునీత, పి.పద్మ, శారద పాల్గొన్నారు.

ప్రజలకు అన్యాయం జరిగితే ఊరుకోం

- పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర

పార్వతీపురం రూరల్,ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ప్రజల అభిప్రాయం మేరకే క్వారీ తవ్వకాలు జరగాలని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర కోరారు. ప్రజలకు అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకోనని తేల్చిచెప్పారు. గురువారం పార్వతీపురం మండలంలోని బడిదేవర కొండ వద్ద జరుగుతున్న గ్రానైట్ తవ్వకాలను ప్రజల ఫిర్యాదు మేరకు పరిశీలించారు. క్వారీ తవ్వకాల వలన తమ ప్రాంతంలో చెరువులు కలుషితం అవుతున్నాయని, బడిదేవర కొండ వద్ద బడిదేవర దేవతను నిత్యం పూజిస్తామని స్థానికులు ఎమ్మెల్యేకు వివరించారు. ఇక్కడ క్వారీ తవ్వకాలకు అనుమతులు మంజూరుచేయడంతో తాము ఇబ్బందులుఎదుర్కొంటున్నామని తెలియజేశారు. దీంతో ఎమ్మెల్యే ఆ ప్రాంతంలో పరిశీలించారు. ప్రజల అభిప్రాయాలను తెలుసుకునేందుకు రెవెన్యూ శాఖ అధికారులు ప్రజలతో సమావేశం నిర్వహించాలని సూచించారు.



క్వారీ నిర్వాహకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయచంద్ర

పాలకొండను జిల్లాగా చేయాలి



సబ్ కలెక్టర్‌కు వినతిప్రతం అందజేస్తున్న సాధన సమితి సభ్యులు

పాలకొండ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): పాలకొండ రెవెన్యూ డివిజన్‌ను జిల్లా చేయాలని, లేకపోతే శ్రీకాకుళం జిల్లాలో కలపాలని పాలకొండ జిల్లా సాధన సమితి నాయకులు కనపాక చౌదరినాయుడు, బుడితి అప్పలనాయుడు, వండాన కూర్మారావు, సబ్బ నానాజీ డిమాండ్‌చేశారు. గురువారం పాలకొండలోని కోటదుర్గమ్మ ఆలయం నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి సబ్ కలెక్టర్ స్వప్నిల్ ధనుంజయకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు శిల్లా బ్రహ్మాజీ, లోకనాధంచౌదరి, రామినాయుడు, గణపతి, ఆనాపు శంకరరావు, కొట్నాన అప్పన్న, అగ్రిగోల్డ్ బాధితుల సంఘం అధ్యక్షుడు బెహరా బంగారు, ద్వారపూడి అప్పలనాయుడు, రమణమూర్తి, కిమిడి రామ్మూర్తి పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు రూ.25 వేలు అందించాలి

పాలకొండ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): స్త్రీశక్తి పథకంతో నష్టపోతున్న ఆటో డ్రైవర్లకు ప్రభుత్వం వాహనమిత్ర పథకం కింద రూ.25 వేలు అందించి ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు, నాయకులు ఎం.తిరుపతిరావు కోరారు. గురువారం పాలకొండలో ఆటో, క్యాబ్‌డ్రైవర్లు ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ యువగళం పాదయాత్రలో నారా లోకేష్ రవాణా రంగ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేస్తామని హామీఇచ్చారని, అధికారంలోకి వచ్చి 14 నెలలైనా హామీ ఇంతవరకు అమలుకు నోచుకోలేదని ఆరోపించారు. కాద రాము అధ్యక్షతన జరిగిన నిరసనలో ఆటో, ర్యాలీ, క్యాబ్ డ్రైవర్లు, యూనియన్ ప్రతినిధులు పి.శేఖర్, మహేష్, దురాగరావు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ఆటో డ్రైవర్లు

పీఏసీఎస్ ఛైర్మన్‌గా మణి

బెలగాం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : పార్వతీపురం పీఏసీఎస్ ఛైర్మన్‌గా ఆగూరు మణితో పాటు డైరెక్టర్లు గురువారం ప్రమాణ స్వీకారం చేశారు.కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు ద్వారపురెడ్డి శ్రీనివాసరావు, ఏఎంసీఛైర్మన్ జి.గౌరి, జనసేన నాయకులు పాలూరి బాబు, పీఏసీఎస్ సీఈవో నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

13, 14 తేదీల్లో సీఐటీయూ జిల్లా మహాసభలు

బెలగాం,ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): సీఐటీయూ జిల్లా మహాసభలను సెప్టెంబర్ 13, 14 తేదీల్లో నిర్వహించనున్నట్లు ఈ సంఘ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు గురువారం పార్వతీపురంలో 11వ మహాసభల గోడపత్రికనుఆవిష్కరించారు. అనంతరం సీఐటీయూ నాయకులు మన్మథరావు మాట్లాడుతూ భారీ సంఖ్యలో కార్మికులు మహాసభలకు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

గరుగుబిల్లిలో హోమాలు

గరుగుబిల్లి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): గరుగుబిల్లి షిర్డీ సాయిబాబా ఆలయంలో గురువారం అనగాదేవి సహితజైగురు దత్త హోమాలు నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ, కాకడ హారతి, తదితర పూజలు నిర్వహించారు.అనంతరంఆలయ ప్రాంగణంలో వీరఘట్టానికి చెందిన యజ్ఞ యాగకర్త ఎస్‌వీఎల్ఎన్ శర్మయాజీ సహకారంతో జైగురుదత్త హోమాలను నిర్వహించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

పసుపు పంటకు ప్రోత్సాహం

(5వ పేజీ తరువాయి)

ప్రభుత్వం నుంచి కూడా పూర్తిగా సహకారం అందడంతో పసుపుపంటను వేల ఎకరాల్లో సాగుచేసేందుకు గిరిజన రైతులు సిద్ధమవుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఎటువంటి ప్రోత్సాహకాలు అందించలేదు. దీంతో గిరిజనులు తీవ్రంగా నష్టపోయారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలోనే సబ్సిడీ రూపంలో పసుపు విత్తనాలను అందిస్తుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

90శాతం రాయితీ

సబ్‌ప్లాన్ మండలాల్లో పసుపు సాగును ప్రోత్సహించేందుకు గాను కూటమి ప్రభుత్వం ప్రత్యేక నిధులను కేటాయిస్తోంది. ఈ మేరకు 2026-27 ఏడాదికి గాను ఎస్‌సీఏ టు టీఎస్ఎస్ (స్పెషల్ సెంట్రల్ అసిస్టెంట్స్ ట్రైబల్ సబ్‌ప్లాన్ స్కీం)నిధులు రూ.7.93కోట్లను కేటాయించింది. మరోవైపు ఒక్కో రైతుకు పసుపు విత్తనాలతో పాటు పాలిషర్లు, బ్యాటరీ స్ప్రేయర్లు, ఆర్గానిక్ ఎరువులను 90శాతం రాయితీ కింద అందించనుంది. కేవలం 10శాతం వాటాను మాత్రమే గిరిజన రైతు భరించాల్సి ఉంటుంది. ఇకపోతే ఏజెన్సీ ప్రాంతాల్లోని వాతావరణ పరిస్థితులకు అనుకూలంగా దిగుబడి వచ్చే సేలం, ప్రగతి వంటి రకాలకు చెందిన పసుపు విత్తనాలను ఈ ప్రాజెక్ట్‌లో భాగంగా రైతులకు పంపిణీ చేయనున్నారు. ఈ విత్తనాల వినియోగంతో పంట దిగుబడి అధికంగా రానుంది. దీంతో గిరిజన రైతులు ఆర్థికంగా లాభపడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

కొత్తబాటలో ఆర్టీసీ

(5వ పేజీ తరువాయి)

ఆర్టీసీ కార్గో సేవలను అందిస్తోంది. ఇంకోవైపు గ్రామాల్లో రైతుసేవా కేంద్రాలకు విత్తనాలు, ఎరువులు సైతం ఆర్టీసీ కార్గో ద్వారా అందిస్తున్నారు.

టెంపుల్ టూరిజంతో పాటు ప్రత్యేక పర్వదినాల్లో ఆర్టీసీ బస్సులను నడుపుతోంది. శుభకార్యాలకు సైతం అద్దెకిస్తోంది. ప్రైవేటు బస్సులతో పోల్చుకుంటే కొంత వెసులబాటు ఇస్తోంది. ప్రాంతం, దూరం, సమయం బట్టి చార్జీలను నిర్ణయిస్తోంది. సుమారు 6 గంటల పాటు అద్దె రూపంలో శ్లాబులు ఉంటాయి. 24 గంటలు దాటితే మాత్రం కిలోమీటర్ల ఆధారంగా చార్జీలు విధిస్తున్నారు.అల్ట్రాడీలక్స్, సూపర్ లగ్జరీ, ఎక్స్‌ప్రెస్, పల్లెవెలుగు బస్సులు అందుబాటులో ఉంటాయి. పల్లెవెలు గుకు అద్దెతక్కువగా ఉండడంతో జిల్లాలోఎక్కువ మంది మొగ్గుచూపుతున్నారు.పైగా 50మంది ప్రయాణించే వెసులుబాటు ఉంది. దీంతో శుభకార్యాలకు ఎక్కువగా ఆర్టీసీ బస్సులనే ఆశ్రయించడం కనిపిస్తోంది. ఆపై అన్ని ఆర్టీసీ కాంప్లెక్స్‌ల్లో సైతం బుకింగ్ కౌంటర్లు ఏర్పాటుచేయడంతో ప్రజలు సులువుగా ఈ బస్సులను బుక్ చేసుకుంటున్నారు.

రవాణాతో పాటు సేవలు..

ప్రజలకు రవాణా సేవతో పాటు కొరియర్ సేవలు అందించేందుకు ఆర్టీసీ సిద్ధంగాఉంది. 50 కిలోల్లోపు వస్తు సామగ్రిని సులువుగా గమ్యస్థానాలకు చేర్చుతోంది. కార్గోసేవలు సైతం సాధారణ ధరకే అందుబాటులో ఉన్నాయి. పారిశ్రామిక, వాణిజ్య అవసరాలను సైతం తీర్చుతోంది. టెంపుల్ టూరిజం, శుభ కార్యాలకు బస్సులు అవసరమైన వారు ప్రతి ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఉండే కౌంటర్లతో పాటు అధికారులను సంప్రదించవచ్చు.

- జి.వరలక్ష్మి, జిల్లా ప్రజారవాణా అధికారి, విజయనగరం

కలెక్టరేట్ బోర్డుపై అక్షరాల తొలగింపు

పార్వతీపురం, ఆగస్టు21 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురంలోని జిల్లా కలెక్టర్ కారాలయంపై రాసిన అక్షరాలను గుర్తుతెలియని వ్యక్తులు కొన్ని చోట్ల తొలగించి బయటకు విసిరేశారు. మద్యం సేవించిన వక్తుల పనేనన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కలెక్టర్ కార్యాలయం బోర్డుపై అక్షరాల తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.







